www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 04 | ఆదివారం | 2 ఆగస్టు, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

## ఆర్థికాభివృద్ధిలో కొత్త మైలురాయి

### రూ.4.19 లక్షలకు చేరిన రాష్ట్ర తలసరి ఆదాయం

- ఏడాదిలో 10.23 శాతం వృద్ధి
- దేశంలోనే అగ్రగామి రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి
- పెట్టుబడులు, ఉపాధి, పారిశ్రామిక ప్రగతే అభివృద్ధికి బలమైన పునాది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:**

తెలంగాణ ఆర్థిక వ్యవస్థ కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.38,900 పెరిగిందని వెల్లడించారు. ఏడాది వ్యవధిలో 10.23 శాతం వృద్ధి నమోదు కావడం రాష్ట్ర ఆర్థిక పురోగతికి నిదర్శనమని పేర్కొన్నారు. దేశంలో అత్యుత్తమ ఆర్థిక పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని సీఎం తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమల విస్తరణ, ఉపాధి అవకాశాల పెరుగుదల, సమర్థవంతమైన పాలన వల్లే ఈ వృద్ధి సాధ్యమైందని చెప్పారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, పారదర్శక నిర్ణయాలు రాష్ట్ర అభివృద్ధిని మరింత వేగవంతం చేశాయని వివరించారు. ఆర్థికాభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, రైతులు, యువత సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశానికి ఆదర్శవంతమైన అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించి, ఉపాధి అవకాశాలను మరింత విస్తరించడం ద్వారా తెలంగాణను ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తామని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.





## పన్నుల వర్షం..

- తెలంగాణకు రికార్డు ఆదాయం
- జులైలో రూ.7,865 కోట్ల వసూళ్లు
- జీఎస్టీ వృద్ధిలో దేశంలోనే రెండో స్థానం
- జాతీయ సగటును అధిగమించిన రాష్ట్రం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ జులై నెలలో రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు నమోదు చేసింది. జీఎస్టీ, వ్యాట్, ప్రొఫెషనల్ ట్యాక్స్ రూపంలో మొత్తం రూ.7,865 కోట్ల ఆదాయం సమకూరింది. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ చరిత్రలో ఇదే అత్యధిక నెలవారీ పన్ను వసూళ్లుగా అధికారులు వెల్లడించారు. గతేడాది జులైతో పోలిస్తే మొత్తం పన్ను ఆదాయం 19 శాతం వృద్ధి నమోదు చేసింది. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించడం, పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడం, పన్ను పరిపాలనలో తీసుకున్న సంస్కరణలు ఈ రికార్డు వసూళ్లకు ప్రధాన కారణాలని అధికారులు పేర్కొన్నారు. జులైలో రాష్ట్ర జీఎస్టీ వసూళ్లు రూ.5,819 కోట్లకు చేరాయి. జీఎస్టీ వృద్ధి రేటులో దేశవ్యాప్తంగా హర్యానా తర్వాత తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్ల వృద్ధి సగటు 10 శాతంగా నమోదవగా, తెలంగాణలో అది 19 శాతానికి చేరడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనమని అధికారులు తెలిపారు. పన్ను వసూళ్లలో నమోదైన ఈ రికార్డు వృద్ధి రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక కార్యకలాపాల విస్తరణ, వ్యాపార రంగంలో పెరుగుతున్న చైతన్యాన్ని ప్రతిబింబిస్తోందని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పేర్కొన్నారు.

## నీట్- యూజీ కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదల

- ఈ నెల 4 నుంచి 17 వరకు తొలివిడత
- సెప్టెంబర్ 8 నుంచి తరగతులు
- అక్టోబర్ 10తో ముగియనున్న అడ్మిషన్ల ప్రక్రియ
- విద్యార్థులకు అనుకూలంగా కీలక మార్పులు

2

## పేపర్ లీకేజీ బిల్లుకు చట్టబద్ధత

- ప్రజా పరీక్షల నివరణ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం
- పరీక్షల్లో అక్రమాలపై కేంద్రం కొరడా
- లీకేజీ కేసులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు
- నిందితులకు 10ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా

6



## జనన, మరణాల నమోదుకు కొత్త రూల్స్

- సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- రెండేళ్ల దాటితే కోర్టు అనుమతి తప్పనిసరి

6



## డీలిమిటేషన్‌ను బిల్లును ఓడించాలి

- తమిళ పార్టీలన్నీ ఏకమవ్వాలి
- పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతిస్తే తమిళులకు ద్రోహం చేసినట్లే
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

2

2




## భోగాపురానికి రెక్కలు

- రూ.5 వేల కోట్ల అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ
- 17 నుంచి వాణిజ్య విమాన సర్వీసుల సేవలు
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త ఊపు

## గ్లోబల్ ఇన్వెస్టర్లే టార్గెట్!

- కొత్త పరిశ్రమలు, ఉద్యోగాలే ప్రధాన అజెండా
- విదేశీ పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి సన్నాహాలు
- అమెరికా, యూకే సహా పలు దేశాల్లో 20 రోజుల పర్యటన
- అంతర్జాతీయ సంస్థలు, పెట్టుబడిదారులతో కీలక భేటీలు
- ఐటీ నుంచి సెమీకండక్టర్ల వరకు భారీ పెట్టుబడులే లక్ష్యం

2

## విద్వేష ప్రసంగాలకు చట్టం

- తెలంగాణ అసెంబ్లీ సెలక్ట్ కమిటీ కీలక కసరత్తు
- భావప్రకటన స్వేచ్ఛకు భంగం లేకుండా నివేదిక రూపొందిస్తాం
- కమిటీ చైర్మన్, మంత్రి పొన్నం ప్రభాకర్
- అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించేలా కార్యాచరణ

2

## అక్రమాలపై ఉక్కుపాదం

- ధరణి, భూ భారతి లావాదేవీలపై ఫాస్ట్‌ట్రాక్ విచారణ
- పేదల భూములు కాజేసిన వారిని వదలం
- రిజిస్ట్రేషన్ల ఆదాయం 20శాతం పెరిగింది
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ప్రజానావ, హైదరాబాద్:** ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని జరిగిన భూ అక్రమాలపై ప్రభుత్వం కఠినచర్యలు చేపడుతోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిశీలిస్తున్నామని, పేదల భూములు లేదా ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. శనివారం సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ఆయన ఈ వివరాలు వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ, ధరణి పోర్టల్ అమల్లో ఉన్న కాలంలో అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు, పేదల భూముల ఆక్రమణలు పెద్ద ఎత్తున జరిగాయని ఆరోపించారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో పరిశీలిస్తూ బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో నిషేధిత జాబితాలో ఎంత భూమి చేర్చారు, ఎవరి హయాంలో చేర్చారు, తర్వాత ఎందుకు తొలగించారు అనే అంశాలపై కూడా సమగ్ర విచారణ కొనసాగుతోందన్నారు.

### అంగుళం భూమీ చేర్చలేదు

ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా ఒక్క అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని పొంగులేటి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, ప్రైవేట్ భూములు లేదా వివాదరహిత ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక 'భూధార్' నంబర్‌ను కేటాయించనున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి విశేష తరువాయి 2లో..

## సోషల్ మీడియానే యువత గొంతుక

- వాస్తవాలు వెలికితీయడంలో ప్రధాన మీడియాలు విఫలం
- ప్రజాస్వామ్యంలో నిర్భయ జర్నలిజం అవసరం
- ఢిల్లీ యువ ఉద్యమం రాజకీయాలకు కొత్త సంకేతం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ప్రజానావ, హైదరాబాద్:** దేశంలో యువత రాజకీయ చైతన్యానికి సోషల్ మీడియా ప్రధాన వేదికగా మారిందని, అనేక కీలక అంశాల్లో సంప్రదాయ మీడియా తన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తించలేకపోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎవరితో పెట్టుకోవద్దో వారితోనే పెట్టుకున్నారని, ఢిల్లీలో యువత చే పట్టిన ఉద్యమం దేశ రాజకీయాల్లో కొత్త సంకేతాలను ఇచ్చిందన్నారు. ప్రస్తుతం 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు గల యువత పత్రికలు, టెలివిజన్ కంటే సోషల్ మీడియా ద్వారానే వార్తలను తెలుసుకుంటోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన 'రాజ్యాంగం – ప్రజాస్వామ్యం – పత్రికా స్వేచ్ఛ' అంశంపై జరిగిన సదస్సులో కేటీఆర్ మాట్లాడారు.

### న్యాయం జరిగేదా?

ఒక యువతిపై లైంగిక దాడి జరిగిన ఘటనలో బాధిత కుటుంబం ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుడిపై ఆరోపణలు చేసినప్పటికీ ప్రధాన మీడియా తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని తరువాయి 2లో..



## జీఎస్‌టీ వసూళ్లలో మరో రికార్డు

**న్యూఢిల్లీ:** దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు జులై నెలలో మరోసారి బలమైన వృద్ధిని నమోదు చేశాయి. దేశీయ లావాదేవీలు, దిగుమతు ల నుంచి అధికంగా పన్ను వసూలు కావడంతో స్థూల జీఎస్‌టీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 15.4 శాతం పెరిగి రూ.2.11 లక్షల కోట్లకు పైగా చేరింది. గత ఏడాది జులైలో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.83 లక్షల కోట్లు ఉండగా, ఈ ఏడాది జూన్‌లో అవి సుమారు రూ.1.95 లక్షల కోట్లు నమోదయ్యాయి. జులైలో కేంద్ర జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) ద్వారా రూ.39,835 కోట్లు, రాష్ట్ర జీఎస్‌టీ (ఎస్‌జీఎస్‌టీ) ద్వారా రూ.47,881 కోట్లు, సమీకృత జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) కింద రూ.1.23 లక్షల కోట్లకు పైగా ఆదాయం లభించింది. ఇక జులైలో జీఎస్‌టీ రిఫండ్‌లు 13.1 శాతం పెరిగి రూ.29,968 కోట్లకు చేరాయి. రిఫండ్‌లను మినహా నికర జీఎస్‌టీ ఆదా యం రూ.1.81 లక్షల కోట్లకు పైగా నమోదుకాగా దేశీయ ఆర్థిక కార్యకలాపాలు, వినియోగం, దిగుమతుల్లో వృద్ధిని ప్రతిబింబిస్తున్నాయని ఆర్థిక వర్గాలు పేర్కొంటున్నాయి.

# గ్లోబల్ ఇన్వెస్టర్లే టార్గెట్!

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడం, కొత్త పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 8 వరకు దాదాపు 20 రోజులపాటు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)తో పాటు మరికొన్ని కీలక దేశాల్లో ఆయన పర్యటించనున్నట్లు అధికార వర్గాల సమాచారం. ఆయా దేశాల్లోని కంపెనీల ప్రతినిధులతో ఖరారయ్యే సమావేశాల ఆధారంగా పర్యటన తేదీల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక సంస్థలు, పెట్టుబడి సంస్థలు, బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు, ప్రవాస భారతీయులతో సీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని వివరించి, కొత్త ప్రాజెక్టులను రాష్ట్రానికి ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లనున్నారు. ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, రక్షణ రంగ తయారీ వంటి వ్యూహాత్మక రంగాల్లో పెట్టుబడులను రాబట్టడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యంగా సమాచారం. అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ రంగ సంస్థలతో, లండన్‌లో అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు, ఆర్థిక సంస్థలు, విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశాలు జరిగే అవకాశముంది.

### గత ఒప్పందాలపై సమీక్ష

ఇంతకుముందు విదేశీ పర్యటనల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల (ఎంఓయూలు) అమలు పురోగతిపై కూడా సీఎం సమీక్షించనున్నారు. ఇప్పటికే పెట్టుబడులు ప్రకటించిన అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో సమావేశమై, ప్రాజెక్టుల అమలును వేగవంతం చేసే అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.

### ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు సన్నాహాలు

చట్టసభల్లో పోటీ చేసే కనీస వయస్సును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కేంద్రానికి సిఫారసు చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయనున్నట్లు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై ఆగస్టు 17 లేదా 18 తేదీల్లో ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించే అవకాశముందని సమాచారం. ఇక సీఎం విదేశీ పర్యటన అనంతరం సెప్టెంబర్ రెండో వారంలో రాష్ట్రానికి తిరిగి రానుండగా, సెప్టెంబర్ మూడో వారంలో వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే దిశగా ప్రభుత్వం ప్రాథమికంగా సన్నాహాలు చేస్తున్నట్లు సచివాలయ వర్గాలు పేర్కొంటున్నాయి

## 2బీహెచ్‌కే ఇళ్ల పేరుతో భారీ మోసం

- నకిలీ కేటాయింపు ఉత్తర్వులతో 50 మందికిపైగా బాధితులకు టోకరా
- నిందితుడి అరెస్ట్, 52 నకిలీ పత్రాలు, మొబైల్ స్వాధీనం




**ప్రజానావ, హైదరాబాద్ :** ప్రభుత్వ 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ పథకం కింద ఇళ్లు కేటాయిస్తామని నమ్మించి నకిలీ కేటాయింపు ఉత్తర్వులు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని హైదరాబాద్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్) బృందం, మొఘల్‌పురా పోలీసులతో కలిసి నిర్వహిం చిన సంయుక్త ఆపరేషన్‌లో అరెస్ట్ చేసింది. నిందితు డు సయ్యద్ సల్మాన్ (27)గా పోలీసులు గుర్తించారు. అతడి వద్ద నుంచి 52 నకిలీ కేటాయింపు ఉత్తర్వులు, ఇతర ఫోర్జరీ పత్రాలతో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తులో కలెక్టరేట్ అధికారులతో తనకు పరిచయాలు ఉన్నాయని నమ్మబలికి ప్రభుత్వ 2బీహెచ్‌కే ఇళ్లు ఇప్పిస్తానంటూ బాధితుల నుంచి నగదు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సేకరించినట్లు వెల్లడైంది. ఈ విధంగా 50 మందికిపైగా అమాయకులను మోసం చేసి లక్షల రూపాయలు దోచుకున్నట్లు విచారణలో తేలింది. విశ్వసనీయ సమాచారం మేరకు జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. యాదేందర్, సబ్‌ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ జాహిద్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, మొఘల్‌పురా పోలీసుల సమన్వయంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరిన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## డీలిమిటేషన్ బిల్లును ఓడించాలి

- తమిళ పార్టీలన్నీ ఏకమవ్వాలి
- పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతిస్తే తమిళులకు ద్రోహం చేసినట్లే
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**చెన్నై:** కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న నియోజక వర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంట్‌లో ప్రతి జాతీయ పార్టీ, ప్రతి తమిళ పార్టీ కలిసి అడ్డుకోవాలని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం తమిళ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన అన్నారు. మామల్లపురంలో శనివారం మీడియాతో మాట్లాడిన రాహుల్, డీలిమిటేషన్ పేరుతో తమిళనాడు రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. తమిళ ప్రజల రాజకీయ శక్తిని బలహీనపరిచే చర్యలను అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా పార్లమెంట్‌లో ప్రతిఘటించాలని కోరారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే వారిని చరిత్ర క్షమించదని, వారిని 21వ శతాబ్దం ఎట్టప్పన్‌గా గుర్తుంచుకుంటుందని వ్యాఖ్యానించారు. అంతకుముందు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల కోసం నిర్వహించిన 10 రోజుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్, పార్టీ బలోపేతానికి నాయకులు వర్గపోరుకు స్వస్తి చెప్పి ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య నిరంతరం పనిచేసే వారికే పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.

### నీట్ బాధిత కుటుంబాలకు పరామర్శ

అనంతరం నీట్ పరీక్షల నేపథ్యంలో ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలను రాహుల్ పరామర్శించారు. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలతో విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రధాని నరేంద్ర మోదీ పరామర్శించలేదని విమర్శించిన ఆయన, దేశ విద్యార్థులకు ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ కార్యక్రమాలు ముగిసిన అనంతరం రాహుల్ గాంధీ చెన్నై నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

## విద్వేష ప్రసంగాలకు చట్టం

- తెలంగాణ అసెంబ్లీ సెలక్ట్ కమిటీ కీలక కసరత్తు
- భావప్రకటన స్వేచ్ఛకు భంగం లేకుండా నివేదిక రూపొందిస్తాం
- సెలక్ట్ కమిటీ చైర్మన్, మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ శాసనసభలో విద్వేషపూరిత ప్రసంగాలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలనే అంశంపై ఏర్పాటైన సెలక్ట్ కమిటీ కీలక సమావేశం శనివారం అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో జరిగింది. కమిటీ చైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేట్ స్పీచ్, క్రైం బిల్లులకు సంబంధించిన నిబంధనలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించేలా కార్యాచరణ రూపొందించాలని కమిటీ నిర్ణయించింది. సభ్యుల సూచనలు, అభిప్రాయాలను మరింతగా సేకరించేం దుకు మరో వారం రోజుల్లో మరో సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, విద్వేషపూరిత ప్రసంగాలను నిరోధించేలా సమతుల్యమైన చట్టానికి కమిటీ రూపురేఖలు సిద్ధం చేస్తోందన్నారు. ఈ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలతో పాటు వివిధ రంగాల నిపుణులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు. వ్యక్తుల గౌరవాన్ని పరిరక్షించడంతో పాటు రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు ఎలాంటి భంగం కలగకుండా నివేదిక రూపొందించడమే కమిటీ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

### సభ్యులకు బిల్లుల ప్రతులు

ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్‌రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి, నంనేని సాంబశివరావు, మాణిక్‌రావు పాల్గొన్నారు. సమావేశం సందర్భంగా హేట్ స్పీచ్, క్రైం బిల్లులకు సంబంధించిన ప్రతులను సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు.

## గోదావరి జలాలపై తెలంగాణకు నష్టం

- నీళ్లు మళ్లించే ఏపీ కుట్రలు వేగమయ్యాయి
- టీఆర్‌ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపణ



**ప్రజానావ, హైదరాబాద్ :** గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తోందని టీఆర్‌ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రాష్ట్ర విభజన తర్వాత గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను అడ్డుకునేలా ఎత్తుగడలు వేస్తోందని విమర్శించారు. తమకు అనులంగా వ్యవహరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతుతో గోదావరి జలాలను మళ్లించే కుట్రలు వేగవంతమయ్యాయని ఆరోపించారు. బచావత్ ట్రిబ్యునల్ టాయింపులను ప్రశ్నిస్తూ ఫిర్యాదులు చేయడం ద్వారా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్‌ఎంబీ) డా ఆంధ్రప్రదేశ్ వైఖరికి అనుగుణంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గోదావరి నదిలో తెలంగాణకు 964 టీఎంసీల జలాలపై హక్కు ఉందని, ట్రిబ్యునల్ రక్షణ కలిగిన టాయింపులు చెల్లవని పేర్కొంటూ తెలంగాణ ప్రాజెక్టులకు ంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కోరడం తెలంగాణ హక్కులను కాలరాయడమేనని కవిత అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వకుండా, తెలంగాణ ప్రజల హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## భోగాపురానికి రెక్కలు

- రూ.5 వేల కోట్ల అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ
- 17 నుంచి వాణిజ్య విమాన సర్వీసుల సేవలు
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త ఊపు

**ప్రజానావ, విశాఖపట్నం:** ప్రధాని నరేంద్ర మోదీ శనివారం విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించారు. సుమారు రూ.5 వేల కోట్ల వ్యయంతో జీఎంఆర్ గ్రూప్ అభివృద్ధి చేసిన ఈ విమానాశ్రయాన్ని ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మౌలిక వసతి ప్రాజెక్టుగా రాష్ట్ర ప్రభుత్వం అభివర్ణిస్తోంది. పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన, ఎగుమతులు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలకు ఈ విమానాశ్రయం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో దీనిని నిర్మించారు. భవిష్యత్తులో సామర్థ్యాన్ని ఏడాదికి నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు పెంచేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. ఈ విమానాశ్రయం ద్వారా ఆగస్టు 17 నుంచి వాణిజ్య విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. విమానాశ్రయం ప్రత్యేకతలను ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రధానమంత్రికి వివరించారు. అనంతరం రాష్ట్రంలో సుమారు రూ.18వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.




## ఒక్కరోజులో రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

- తొలిసారి రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు
- దేశంలోనే నెంబర్ వన్‌గా మీసేవ ఆన్‌లైన్ ప్లాట్ ఫార్మ్
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజానావ, హైదరాబాద్ :** ప్రభుత్వ సేవలు, లావాదేవీలను ఆన్‌లైన్‌లో ఓ వేదిక మీద అందిస్తోన్న మీసేవ మరొక రికార్డును నమోదు చేసింది. శుక్రవారం ఒక్క రోజే 2,20,172 లావాదేవీలు నమోదు అయ్యాయి. ఇలా ఓ రోజు రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు జరిగాయని ఐటిశాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వెల్లడించారు. మీసేవ డిజిటల్ సేవను మరింతగా అభివృద్ధి చేయటం, సేవలను విస్తృత పరచటం, ఆమేరకు ప్రజల వాడకాన్ని ప్రోత్సహించటంలో ప్రజాప్రభుత్వం చొరవచూపిస్తోంది. దీంతో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. రాష్ట్ర పౌరులకు వేగంగా, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలను అందించేందుకు మీసేవ వేదికను ప్రభుత్వం నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ప్రతీ రోజు సరాసరి 70 నుంచి 80 వేల కార్యకలాపాలు మీసేవ ద్వారా నమోదవుతాయి. శుక్రవారం ఓ రోజులో 2.20 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. వీటిల్లో ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఫ్యామిలీ కార్డు, రవాణాశాఖ, ఆదాయ ధృవీకరణ పత్రాల అప్లికేషన్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఘనత తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిందని మంత్రి ప్రకటించారు. పనితీరును మెరుగుపరచడం, సేవల లభ్యతను విస్తరించడం, కొత్త పౌర సేవలను అందుబాటులోకి తీసుకురావడం, సాంతిక, మౌలిక వసతులను బలోపేతం చేయడం లాంటి చర్యల ఫలితంగానే ఈ మైలురాయి సాధ్యమైందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మీసేవ ంద్రాల ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు సేవలను అందించడంలో విశేష కృషి చేసిన నిర్వాహకులు, సాంతిక బృందాలను మంత్రి అభినందించారు. మీసేవ ద్వారా ప్రస్తుతం ఫ్యామిలీ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, వివిధ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ యుటిలిటీ చెల్లింపులు, అలాగే పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉన్నాయి. అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చడం, ఆధునిక సాంతికతను వినియోగించడం, సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను మరింత మెరుగుపరచడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## డిజిటల్ బాటలో వ్యవసాయ మార్కెట్లు

- వ్యవసాయ మార్కెట్లలో పూర్తి డిజిటలీకరణ
- మార్కెట్ కమిటీల ఆటోమేషన్‌కు ఆదేశాలు
- కొనుగోళ్లు, లావాదేవీలన్నీ డిజిటల్ విధానంలోనే
- సౌర విద్యుత్ వ్యవస్థలు, పత్తి కొనుగోళ్ల
- కోహెడ పండ్ల మార్కెట్ పనులు వేగవంతం చేయాలి
- అధికారులకు మంత్రి తుమ్మల సూచనలు



**ప్రజానావ, హైదరాబాద్ :** రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖను పూర్తిస్థాయిలో డిజిటలీకరించి పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, పత్తి కొనుగోళ్ల సన్నద్ధత, మార్కెట్ యార్డుల అభివృద్ధిపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 206 మార్కెట్ కమిటీలను పూర్తిస్థాయిలో ఆటోమేషన్ చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు, టెండర్ పక్రియలను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసి, సెప్టెంబర్ నుంచి అమలు ప్రారంభించాలని సూచించారు. ప్రతి మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు, ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్, గేట్ ఎంట్రీ, ఎగ్జిట్ వ్యవస్థలను ఒ డిజిటల్ ఎ÷—లాట్‌ఫారంపై అనుసంధానం చేయాలని ఆదేశించారు. రవాణా శాఖలో అమలవుతున్న నంబర్ ప్లేట్ స్కానింగ్ విధానాన్ని మార్కెట్ యార్డుల్లోనూ అమలు చేసి, వాహనాల ప్రవేశం, నిష్క్రమణ, తూకం, కొనుగోలు లావాదేవీలన్నీ డిజిటల్ రూపంలో నమోదు అయ్యేలా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలని సూచించారు. ఇకపై మార్కెటింగ్ శాఖలో జరిగే అన్ని కొనుగోళ్లు పూర్తిగా డిజిటల్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు. రానున్న పత్తి కొనుగోలు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ముందస్తు సన్నద్ధత అవసరమని మంత్రి పేర్కొన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు, సంబంధిత అధికారులతో ఆగస్టు తొలి లేదా రెండో వారంలో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. గతంలో గుర్తించిన లోపాలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రయోజనం పూర్తిగా రైతుల అందేలా చూడాలని సూచించారు. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులు, గోదాముల్లో సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును అత్యంత ప్రాధాన్యంగా చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వచ్చే నెలలోగా ఫీజిబిలిటీ నివేదికలు సేకరించి, సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించి నవంబర్ నాటికి అన్ని మార్కెట్ యార్డులు, గోదాముల్లో సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కెటింగ్ శాఖలో కొనసాగుతున్న అన్ని ఇంజినీరింగ్ పనులకు స్పష్టమైన గడువులు నిర్ణయించి, ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే పనులను ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు అప్పగించి వేగవంతం చేయాలని సూచించారు. కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ డిజైన్లను వచ్చే వారంలో ఖరారు చేసి, ముఖ్యమంత్రి అనుమతితో వచ్చే నెలలో నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మార్కెటింగ్ శాఖలో ఇంజినీరింగ్, పరిపాలన విభాగాల్లో ఉన్న సిబ్బంది కొరతను గుర్తించి అదనపు పోస్టుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని మార్కెటింగ్ డైరెక్టర్‌కు మంత్రి ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా అవసరమైన సిబ్బందిని నియమించాలని స్పష్టం చేశారు. సచివాలయంలో వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నిర్మల్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఆయిల్ పామ్ రైతు సంఘాల ప్రతినిధులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి పలు సమస్యలను వివరించారు. నాణ్యమైన మొక్కలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచడం, ప్రతి మండలంలో ఆయిల్ పామ్ గెలల సేకరణ ంద్రం ఏర్పాటు, బ్యాంకు రుణాలు, యంత్ర పరికరాలపై సబ్సిడీ, కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటు వంటి అంశాలపై వినతిపత్రం అందజేశారు.దీనిపై స్పందించిన మంత్రి, ఆయిల్ పామ్ రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ దేశంలోనే ఆయిల్ పామ్ సాగుకు అత్యంత అనుల ప్రాంతమని, ఈ పంట ద్వారా రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు కోరిన వెంటనే నాణ్యమైన మొక్కలు అందేలా కంపెనీలకు ఇప్పటి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## నీట్–యూజీ కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదల

- ఈ నెల 4 నుంచి 17 వరకు తొలివిడత
- సెప్టెంబర్ 8 నుంచి తరగతులు
- అక్టోబర్ 10తో ముగియనున్న అడ్మిషన్ల ప్రక్రియ
- విద్యార్థులకు అనుకూలంగా కీలక మార్పులు

**న్యూఢిల్లీ:** ఎంబీబీఎస్‌తో పాటు ఇతర అండర్‌గ్రాడ్యుయేట్ వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్–యూజీ–2026 అఖిల భారత కోటా (ఏఐక్యూ) కౌన్సెలింగ్ ప్రక్రియ ఆగస్టు 4 నుంచి ప్రారంభం కానుంది. 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన తరగతులు సెప్టెంబర్ 8 నుంచి ప్రారంభమవుతాయని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) ప్రకటించింది. ఎంసీసీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం తొలి విడత కౌన్సెలింగ్ ఆగస్టు 4 నుంచి 17 వరకు నిర్వహించనుండగా, ఎంపికైన అభ్యర్థులు ఆగస్టు 22లోపు సంబంధిత కళాశాలల్లో చేరాలి. రెండో విడత కౌన్సెలింగ్ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 2 వరకు, మూడో విడత సెప్టెంబర్ 10 నుంచి 18 వరకు జరుగుతుంది. ఖాళీగా మిగిలిన సీట్ల భర్తీ కోసం సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3 వరకు స్ట్రే వెకెన్సీ రౌండ్ నిర్వహించనున్నారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులు అక్టోబర్ 10లోపు కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది.

### రాష్ట్ర కోటా కౌన్సెలింగ్

రాష్ట్ర కోటా సీట్లకు తొలి విడత కౌన్సెలింగ్ ఆగస్టు 13 నుంచి 22 వరకు, రెండో విడత ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు, మూడో విడత సెప్టెంబర్ 16 నుంచి 26 వరకు నిర్వహించనున్నారు. స్ట్రే వెకెన్సీ రౌండ్ అక్టోబర్ 3 నుంచి 5 వరకు జరగనుంది. ఈసారి కౌన్సెలింగ్ ప్రక్రియను మరింత పారదర్శకం గా, విద్యార్థి అనుకూలంగా మార్చేందుకు ఎంసీసీ పలు కీలక మార్పులు చేసింది. సీటు అప్‌గ్రేడ్ కోరిన అభ్యర్థులు అడ్మిషన్ కోసం కళాశాలకు ప్రత్యక్షంగా హాజరుకావాల్సిన అవసరం లేకుండా సౌకర్యం కల్పించింది. అలాగే, కేటాయించిన సీటును వదులు కోవాలనుకునే వారు ఎంసీసీ పోర్టల్‌లోనే ఆన్‌లైన్ ద్వారా రాజీనామా చేసుకునే అవకాశం కల్పించారు. డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో ఎన్‌ఆర్‌ఐ రిజర్వేషన్‌కు సంబంధించిన ధ్రువపత్రాలను కూడా ఆన్‌లైన్‌లోనే సమర్పించుకునే వెసులుబాటు కల్పించారు. కౌన్సెలిం గ్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి అన్ని వైద్య కళాశాలలు, రాష్ట్ర కౌన్సెలింగ్ సంస్థలు షెడ్యూల్‌ను కచ్చితంగా అమలు చేయాలని ఎంసీసీ ఆదేశించింది. అవసరమైతే శని, ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాలను కూడా పని దినాలుగా వినియోగించాలని సూచించింది.

## అక్రమాలపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

స్పందన లభించిందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి వినియోగంపై సమగ్ర విధాన నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం అన్ని కోణాల్లో అధ్యయనం చేస్తోందన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### బీఆర్‌ఎస్‌వి రాజకీయ విమర్శలు

హైదరాబాద్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌ను చూసి బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని పొంగులేటి అన్నారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షాలకు నీరు కారడం వారి పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లకు కూడా మరమ్మతులు చేపడతామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నిధులు విడుదల చేయకపోయినా, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే గ్రానైట్ బిల్లులు చెల్లిస్తుందని వెల్లడించారు.

### అంచనా కంటే అధిక ఆదాయం

భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగిందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రూ.13 వేల కోట్లుగా ఉన్న వార్షిక ఆదాయం గత ఏడాది రూ.15 వేల కోట్లకు చేరిందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది రూ.18 వేల కోట్లకు చేరే అవకాశముందని, రిజిస్ట్రేషన్ పత్రాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

## సోషల్ మీడియానే యువత గొంతుక

(మొదటిపేజీ తరువాయి)

కేటీఆర్ విమర్శించారు. సోషల్ మీడియాలో విషయం విస్తృతంగా ప్రచారం కావడంతోనే ఘటన వెలుగులోకి వచ్చి, బాధితురాలికి న్యాయం జరిగే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇక లగచర్లలో గిరిజనులపై జరిగిన ఘటనలు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదం వంటి కీలక అంశాల్లో ప్రధాన మీడియా ఆశించిన స్థాయిలో స్పందించలేదని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలో ఉన్నవారు జర్నలిస్టుల పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నా, వారిని ప్రశ్నించే ధైర్యం మీడియా కోల్పోయిందన్నారు. ప్రస్తుతం స్వేచ్ఛగా, నిర్భయంగా పరిశోధనాత్మక కథనాలు వెలువడుతున్నాయా అనే ప్రశ్నకు సమాజమే సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వాస్తవాలను చెప్పడం కొన్నిసార్లు చేదుగా అనిపించినా, ప్రజాస్వామ్యంలో నిజాలను వెలుగులోకి తీసుకురావడం మీడియా ప్రధాన బాధ్యత అని కేటీఆర్ స్పష్టం చేశారు.



## వేములవాడ శ్రీ మహాలక్ష్మి ముదిరాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏదుల తిరుపతి

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ శ్రీ మహాలక్ష్మి ముదిరాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏదుల తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం అసోసియేషన్ భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పిల్లి మధు, ఉపాధ్యక్షుడిగా రెడ్డవేని మోహన్, కార్యదర్శిగా కూన శ్రీనివాస్, కోశాధికారిగా రేగుల దేవేందర్, సహాయ కార్యదర్శులుగా గొట్టం శ్రీనివాస్, రేగుల రమేశ్ బాబు, ముఖ్య సలహాదారులుగా కూన అంజయ్య, గొట్టం దేవయ్య, కమిటీ సభ్యులుగా బొడిగె భూమయ్య, బొజ్జ రాజు, ఏదుల నాగరాజు, రేగుల లక్ష్మి నారాయణ, కోలకాని రాజు, గూళ్ల పోచయ్య, కూన దేవయ్య, మల్లవేని వెంకటి, కూన బొందయ్య, దయ్యాల అంజయ్య, ఏదుల శ్రీనివాస్, తునికి చంద్రయ్య, ఏదుల శ్రీధర్, గొట్టం రాజు, మామిండ్ల రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ఎన్నికపై సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# ఆసియా అభివృద్ధికి భారత్ చోదకశక్తి

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- పెట్టుబడులకు తెలంగాణ అనువైన గమ్యం: గవర్నర్





**ప్రజానావ, హైదరాబాద్ :** ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆసియా చోదకశక్తిగా మారుతున్న తరుణంలో, భారత్ బాధ్యతాయుతమైన, విశ్వసనీయ ప్రపంచ భాగస్వామిగా ముందుకు సాగుతోందని గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం నిర్వహించిన ఇండియా–ఏషియన్ బిజినెస్ కాన్‌క్లేవ్ కు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న యాక్ట్ ఈస్ట్ పాలసీ, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, పీఎం గతిశక్తి, జాతీయ లాజిస్టిక్స్ విధానం వంటి కార్యక్రమాలు దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపాయని గవర్నర్ పేర్కొన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పారదర్శక విధానాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. తెలంగాణ పరిశ్రమలకు అనుకూల విధానాలు, సమర్థవంతమైన పాలన, నైపుణ్యం కలిగిన యువ శక్తితో ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని గవర్నర్ తెలిపారు. వ్యవసాయం, అధునాతన తయారీ, సేవారంగాల అభివృద్ధిలో రాష్ట్రం సమతుల పురోగతి సాధించిందన్నారు. హైదరాబాద్ దేశంలోనే కాకుండా దక్షిణాసియాలో ప్రముఖ ఆవిష్కరణ, సాంకేతిక కేంద్రంగా ఎదిగిందని, ప్రపంచ అగ్రశ్రేణి సాంకేతిక సంస్థలకు ప్రాధాన్య గమ్యస్థానంగా నిలిచిందన్నారు. వ్యాక్సిన్లు, ఔషధాల తయారీలో నగరం ప్రపంచవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు పొందిందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ స్టార్టప్‌లకు ప్రపంచస్థాయి వేదికగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. భారత్–ఆసియా దేశాల మధ్య వాణిజ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసి, సుస్థిర అభివృద్ధి, సమ్మిళిత ప్రగతి, మానవ సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ 'ది బిజినెస్ టైకూన్‌లు' ప్రత్యేక ఎడిషన్‌ను ఆవిష్కరించారు. చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల బిజినెస్ లీడర్ లను గవర్నర్ సత్కరించారు. కార్యక్రమంలో గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం వ్యవస్థాపకుడు, గ్లోబల్ చైర్మన్ డా. జితేంద్ర జోషి, డైరెక్టర్ అండ్ జనరల్ సెక్రటరీ దీపాలి గాడ్కరీ, హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్, గ్లోబల్ డైరెక్టర్ (ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడ్ కౌన్సిల్) అభిషేక్ జోషి, వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లు, పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

### గవర్నర్‌ను కలిసిన ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షులు

తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు డా. గిల్లెల్ల చిన్నారెడ్డి శనివారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయ, సహకార శాఖ డైరెక్టర్ బి. గోపి, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ ఎస్‌కే. యాస్మీన్ బాషా ఉన్నారు.

## అవకతవకలపై కలెక్టర్‌కు బీజేపీ కౌన్సిలర్ల ఫిర్యాదు

**స్పందన లేకుంటే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరిక**

**ప్రజానావ, కామారెడ్డి :** కామారెడ్డి మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం ఏర్పడిన అనంతరం జరిగిన బిల్లుల చెల్లింపుల్లో సుమారు రూ.1.70 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బీజేపీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులతో పాటు పాత్ర ఉన్న ప్రజాప్రతినిధులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ కౌన్సిలర్లు తెలిపిన వివరాల ప్రకారం, నూతన పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ. 5,92,91,364 ఖర్చు చేయగా, అందులో 75 బిల్లులకు సంబంధించిన రూ.1,13,14,566 చెల్లింపుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. అలాగే ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధుల కింద రూ. 71,28,937 వ్యయం చేయగా, అందులో ఐదు బిల్లులకు సంబంధించిన రూ.59,86,353 చెల్లింపులపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి సంబంధిత అధికారులు, వాటి వెనుక ఉన్న ప్రజాప్రతినిధుల పాత్రను వెలికితీసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

# జలకళ సంతరించుకున్న ఉప్పల్ నల్లచెరువు

- భారీ వర్షాలతో వరద నీటితో నిండిన పునరుద్ధరించిన చెరువు
- రూ.20 కోట్లతో హైడ్రా సమగ్రాభివృద్ధి



**ప్రజానావ, హైదరాబాద్ :** హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు చేపట్టిన ఉప్పల్ నల్లచెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జలకళను సంతరించుకుంది. గతంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి మురికి కూపంగా మారిన ఈ చెరువును సమగ్రంగా అభివృద్ధి చేసిన ఫలితంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన భారీ వరద నీరు చెరువులోకి చేరి నిండుకుండలా మారింది. వర్షాకాలంలో వరద నీరు చెరువులోకి చేరేలా, తక్కువ మొత్తంలో ప్రవహించే మురుగు నీరు ప్రత్యేక బైపాస్ కాలువ ద్వారా బయటకు వెళ్లే విధంగా హైడ్రా కాలువలను అభివృద్ధి చేసింది. దీంతో ఇటీవల కురిసిన వర్షాల సమయంలో ఎగువ ప్రాంతాల్లో నీటిమునిగే పరిస్థితులు తలెత్తకుండా వరద ప్రవాహం నల్లచెరువుకు చేరింది. చెరువులో సుమారు 10 ఎకరాలకు పైగా ఉన్న ఆక్రమణలను తొలగించి దాని విస్తీర్ణాన్ని దాదాపు 70 ఎకరాలకు పెంచిన హైడ్రా, సుమారు రూ.20 కోట్ల వ్యయంతో సమగ్ర అభివృద్ధి పనులను చేపడుతోంది. ఈ అభివృద్ధిలో భాగంగా ఉప్పల్ నల్లచెరువుకు ఎగువన ఉన్న నాచారం చెరువుతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వరద నీరు సులభంగా చేరేందుకు రెండు ఇన్లెట్లను నిర్మించగా, చెరువు నిండిన తర్వాత అదనపు వరద నీరు సాఫీగా మూసీ నదికి చేరేలా ఆధునిక ఔట్‌లెట్‌ను కూడా ఏర్పాటు చేసింది. నీటి నిల్వకే పరిమితం కాకుండా ప్రజలకు విశ్రాంతి, ఆరోగ్యం, వినోదం కల్పించే లక్ష్యంతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పటిష్టమైన మెయిన్ బండ్, పిల్లల కోసం ప్లే ఏరియా, ఓపెన్ జిమ్ వంటి ఆధునిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నారు. కుటుంబాలతో కలిసి ప్రశాంతంగా గడిపే ఆహ్లాదకరమైన పర్యాటక, వినోద కేంద్రంగా ఉప్పల్ నల్లచెరువును తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. హైడ్రా తొలి దశలో అభివృద్ధి చేస్తున్న ప్రధాన చెరువుల్లో ఉప్పల్ నల్లచెరువు ఒకటిగా నిలుస్తుండగా, ఇప్పటికే మూడు చెరువులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన హైడ్రా, ఇదే తరహాలో ఉప్పల్ నల్లచెరువును కూడా త్వరలో నగరానికి మరో అందమైన జలవనరుగా, పర్యావరణ హిత విశ్రాంతి కేంద్రంగా అందుబాటులోకి తీసుకురానుంది.




## 6న 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ'

- సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సభ.. పోస్టర్ ఆవిష్కరించిన టీఆర్ఎస్ నాయకులు

**ప్రజానావ, హైదరాబాద్ :** సామాజిక న్యాయ తెలంగాణ సాధనే లక్ష్యంగా ఆవిర్భవించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ ఈనెల 6వ తేదీన సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం ''సామాజిక న్యాయ తెలంగా ణ సంకల్ప సభ'' నిర్వహిస్తోంది. తెలంగాణ సిద్ధాం తకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకొని సరూర్ ఇండోర్ స్టేడియంలో సభ నిర్వహిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన నాయకు లు తెలిపారు. శనివారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భం గా పార్టీ సీనియర్ నాయకులు ఎల్. రూప్ సింగ్ మాట్లాడుతూ, తెలంగాణలో ప్రతి సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం దక్కాల్సిన అవసరముంద న్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఈ నెల 6న సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ నిర్వహించనున్నామని చెప్పారు. సామాజిక తెలంగాణ కావాలని కోరుకున్న ప్రొఫెసర్ జయశం కర్ సార్ జయంతి రోజునే ఈ సభను నిర్వహిస్తున్నా మన్నారు. జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీల్లోని అనేక కులాల వారికి కనీసం గ్రామ సర్పంచ్‌గా కూడా అవకాశం దక్కడం లేదన్నారు. అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో ప్రాతినిధ్యం దక్కేలా ఈ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నవీన్ ఆచారి, నరేశ్ ప్రజాపతి, కోల శ్రీనివాస్, చిలుక ప్రవీణ్, సుహైబ్ తదితరులు పాల్గొన్నారు.




## గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేద్దాం

**టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సంకె పల్లి సుమలత**

**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లాలో గ్రామ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షురాలు సంకేపల్లి సుమలత పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రాజకీయాలలో ప్రాతినిధ్యం కల్పించడం కోసమే కల్వకుంట్ల కవిత టిఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేశారని తెలిపారు. మహిళలు సంఘటితమై కవితక్క నాయకత్వంలో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మహిళలు పదవి చేపట్టినట్లయితే ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన కవితక్కను ముఖ్యమంత్రిగా చూడాలన్నదే తమ లక్ష్యం అన్నారు. టిఆర్ఎస్ పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ముందుకు పోతామన్నారు. తనకు జిల్లా అధ్యక్షురాలిగా నియమించినందుకు గర్వంగా ఉందని, అందుకు పార్టీ అధినేత్రి కవితక్కకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంకె పల్లి సుధాకర్ శర్మ. వరద సతీష్ కుమార్. కూర సురేష్. నూనె మల్లేష్ యాదవ్. కుసుమ విష్ణు. మద్దుల శ్రీనివాస్ రెడ్డి. బాయికాని ఆంజనేయులు. నవీన్. శైలజ. కదిరి భాస్కర్. వీరబత్తి రమేష్. ఎడ్ల రమేష్. మామిడిపల్లి రవి. బొల్లం సంధ్య. కనకయ్య. బండి శ్రీహరి. బద్రి. జావీద్. తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల అత్యవసర పరిస్థితులకు జిల్లా యంత్రాంగం అప్రమత్తం

- కంట్రోల్ రూమ్ ద్వారా ప్రజలకు 24 గంటల తక్షణ సేవలు అందిస్తాం: కలెక్టర్ అంకిత్
- మూడు షిఫ్టుల్లో అధికారులు, సిబ్బంది విధులు.. నిర్లక్ష్యంపై కఠిన చర్యల హెచ్చరిక



**ప్రజానావ, కొత్తగూడెం:** వర్షాకాల పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలోని జీ–19 గదిలో జిల్లా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆగస్టు 3 నుంచి వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులను విధులకు నియమిస్తూ స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. కంట్రోల్ రూమ్ సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తొలి షిఫ్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రెండో షిఫ్ట్, రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 7 గంటల వరకు మూడో షిఫ్ట్ విధానంలో అధికారులు, సిబ్బంది పనిచేస్తారని తెలిపారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదు, సమాచారం, వర్షాలకు సంబంధించిన అత్యవసర అభ్యర్థనలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం అందిస్తూ తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యల వివరాలను కూడా నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో వర్షాల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ రహదారులు దెబ్బతినడం, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం వంటి పరిస్థితులు తలెత్తిన వెంటనే సంబంధిత శాఖలు స్పందించి ఉపశమన చర్యలు చేపట్టాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌కు కేటాయించిన అధికారులు, ఉద్యోగులు తప్పనిసరిగా విధులకు హాజరయ్యేలా ఆయా శాఖల జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎవరైనా సెలవులో ఉంటే వారి స్థానంలో వెంటనే ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా లేదా ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. వర్షాల కారణంగా అత్యవసర పరిస్థితులు లేదా ఇతర సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలు జిల్లా కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 08744–241950కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల నుంచి అందే ప్రతి సమాచారంపై వెంటనే స్పందించి అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని వేళలా సిద్ధంగా ఉంటుందని కలెక్టర్ అంకిత్ తెలిపారు.

## మై భారత్ పోర్టల్‌లో నమోదు ద్వారా యువతకు అవకాశాలు

**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లాలోని యువతకు మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా వివిధ జాతీయ, రాష్ట్రస్థాయి కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవా అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ ఛాంబర్ లో మై భారత్ (మేరా యువ భారత్ మై భారత్ సిరిసిల్ల) నమోదు డ్రైవ్‌కు సంబంధించి జిల్లా సలహా కమిటీ సమావే శాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవి న్యూ గడ్డం నగేష్ మాట్లాడుతూ జిల్లాలో నమోదు లక్ష్యాలను సాధించేందుకు మండల, గ్రామ స్థాయి లో విస్తృత ప్రచారం చేపట్టాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. సమావేశంలో మై భారత్ జిల్లా కార్యక్రమ ఉమ్మడి జిల్లా అధికారి గోలి తిరుప తిరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం సిరిసిల్ల జిల్లాలో కొనసాగుతున్న మైభారత్ ఇంటెన్సివ్ నమోదు మరియు అవగాహన డ్రైవ్ జులై 1 నుండి ఆగస్టు 15 వరకు కొనసాగుతుందని, పాఠశాలలు, కళాశాల లు, క్రిడాకారులు యువజన సంఘాల, భాగస్వా మ్యంతో ఈ డ్రైవ్‌ను మరింత ముందుకు తీసుకెళ్తా మని తెలిపారు. సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మి నారా యణ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీనివాసాచారి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, మైభారత్ జిల్లా కార్యక్రమ అధికారి జి.కిరణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ప్రజానావ, ఖమ్మం:** ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్' విజయవంతంగా ముగిసిందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. జూలై 1 నుంచి 31 వరకు నెలరోజుల పాటు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 122 మంది చిన్నారులను రక్షించినట్లు వెల్లడించారు. వీరిలో 110 మంది బాలురు, 12 మంది బాలికలు ఉన్నారని చెప్పారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఖమ్మం పోలీసులు, కార్మిక శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం (డీసీపీయూ), బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ), స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పరిశ్రమలు, కంపెనీలు, దుకాణాలు, హోటళ్లు, నిర్మాణ ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

## కేసీఆర్ నగర్ 2బీహెచ్‌కేలో పోలీసుల విస్తృత తనిఖీలు

- 49 బైక్‌లు, మూడు ఆటోలు సీజ్
- రెండు బెల్ట్‌షాపులపై కేసులు
- 18.65 లీటర్ల మద్యం స్వాధీనం
- గంజాయి, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



**ప్రజానావ, సిద్ధిపేట:** సిద్ధిపేట పట్టణంలోని కేసీఆర్ నగర్ 2బీహెచ్‌కే నివాస సముదాయంలో సిద్ధిపేట పోలీసులు శనివారం విస్తృత కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిద్ధిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో నివాస సముదాయంలోని అన్ని బ్లాకులను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని 49 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెండు బెల్ట్‌షాపులపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి 18.65 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో సిద్ధిపేట నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన డాగ్ స్క్వాడ్ సేవలను కూడా వినియోగించారు. తనిఖీల అనంతరం స్థానికులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఏసీపీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయం, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్–100కు సమాచారం అందించాలని కోరారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలు వెంట ఉంచుకోవడంతో పాటు హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. పోలీస్ ఉద్యోగ మిత్ర, సిద్ధిపేట సురక్ష నేత్ర, షీ సేఫ్ వంటి పోలీసు సేవలపై ప్రజలకు వివరించారు. గుర్తింపు పత్రాలు లేని వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇవ్వవద్దని, పూర్తి వివరాలు ధ్రువీకరించిన తర్వాతే అద్దెకు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట 1–టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి, 2–టౌన్ ఇన్‌స్పెక్టర్ మురళి, సిద్ధిపేట రూరల్ సీఐ విద్యాసాగర్, దుబ్బాక సీఐ రాజేష్‌తో పాటు 14 మంది ఎస్ఐలు, సుమారు 100 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కోర్టు భవన నిర్మాణ నాణ్యతలో రాజీ వద్దు

- గడువులోగా పనులు పూర్తి చేయాలి
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. తుకారాంజి
- సిరిసిల్ల నూతన కోర్టు సముదాయ భవన నిర్మాణ పనుల పరిశీలన

**ప్రజానావ, సిరిసిల్ల :** కోర్టు భవన నిర్మాణ నాణ్యతలో రాజీ పడొద్దని, గడువులోగా పనులు పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్. తుకారాంజి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పర్యటించిన హైకోర్టు న్యాయమూర్తికి సిరిసిల్ల పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో జస్టిస్ తుకారాంజికి జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి, జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి బి. పుష్పలత, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితె పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తదనంతరం నిర్మాణంలో ఉన్న రూ.82 కోట్లతో నిర్మిస్తున్న నూతన కోర్టు సముదాయ భవన నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించిన జస్టిస్ తుకారాంజికు ఇంజనీర్లు నిర్మాణ పురోగతి, పూర్తయిన పనులు, మిగిలిన పనుల వివరాలను వివరించారు. ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సిరిసిల్ల, వేములవాడ సీనియర్ సివిల్ న్యాయమూర్తు లు పి. లక్ష్మణాచారి, అజయ్ కుమార్ జాదవ్, సిరిసిల్ల జూనియర్ సివిల్ జడ్జి జి. మేఘన, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తరాంధ్రకు మణిహారం

# భోగాపురం!

**ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకా శాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమీలో అంతర్జా తీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామిక ఎగుమతులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగావకా శాలు విస్తరిస్తాయి. దీంతో అభివృద్ధి వేగంగా సాగడానికి దోహదపడు తుంది. ఏపీలో అనేక సహజ వనరులు ఉన్నప్పటికీ గతంలో నిర్లక్ష్యం చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది.**

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, సువిశాల సముద్రతీరం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కలిసి వచ్చే అంశం. రోడ్లు గ్రామాలను అనుసంధానిస్తే, రైల్వేలు పరిశ్రమలను కలుపుతాయి. ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకా శాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమీలో అంతర్జా తీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామిక ఎగుమతులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగావకా శాలు విస్తరిస్తాయి. దీంతో అభివృద్ధి వేగంగా సాగడానికి దోహదపడు తుంది. ఏపీలో అనేక సహజ వనరులు ఉన్నప్పటికీ గతంలో నిర్లక్ష్యం చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ఓ వైపు భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చింది. ప్రధాని మోడీ దీనిని ప్రారంభించడం ద్వారా ఉత్తరాంధ్రాకు గేట్‌వేను తెరిచారు. అమరావతి రాజధాని నిర్మాణం డా శరవేగంగా సాగుతోంది. అలాగే పోలవరం పూర్తి కావస్తోంది. ఇవన్నీ నిజానికి జగన్ హయాంలోనే పూర్తి కావాల్సిన ప్రాజక్టులు. కానీ జగన్ నిర్లక్ష్యం కారణంగా వీటిని పక్కన పెట్టారు. మనమెంతకాలం ఉంటామన్నది పక్కన పెట్టి అభివృద్ధిలో మనదైన ముద్ర వేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారు. దశాబ్దాలుగా విశాఖపట్నం ఉత్తరాంధ్రకు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్నా, ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం కాదు. ఇది నావల్ డాక్ వారి విమానాశ్రయం కావడంతో చంద్రబాబు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి నిర్ణయించారు. విశాఖ పట్టణానికి ఇది దగ్గరగా ఉండడ, ఉత్తరాంధ్రకు కూడా కలసి వచ్చే అంశం. విశాఖ పూర్తిస్తాయి విమానాశ్రయం కాకపోవడంతో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు విశాఖకు తగినన్ని సర్వీసులు నడపలేక పోయాయి. విశాఖ పట్నం ఐటీ, ఫార్మా, వైద్యం, విద్య పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా ఎదుగుతున్న వేళ, ఒక పూర్తిస్థాయి పౌర అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఏర్పడింది. అందు ఎపి విభజన తరవాత చంద్రబాబు భోగాపురం కోసం నిర్ణయించారు. 2014లో విశాఖ సమీపంలోని భోగాపురాన్ని గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కేవలం విమానాశ్రయమే కాకుండా ఏరోసిటీ, విమానాల మరమ్మతులు, పైలట్ శిక్షణ కేంద్రాలతో కూడిన లాజిస్టిక్స్ హబ్‌గా దీనిని డిజైన్ చేశారు. భూసేకరణ చేపట్టి, ఇళ్లు కోల్పోయిన 390 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక కాలనీలు నిర్మించారు. అన్నింటికి మించి రామ్మోహన్ నాయుడును ఎన్‌డిఎలో పౌర విమానయాన శాఖ మంత్రిగా నియించకోవడం ద్వారా పనులు చకచకా చేయించుకోగలిగారు. చంద్రబాబు సీఎంగా కొనసాగివుంటే 2019లోనే ఇది పూర్తయ్యేది. దాదాపు 12 ఏళ్ల తరవాత మళ్లీ రెండో దఫా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక భోగాపురం వేగం పుంజుకుని చకచకా పనులు పూర్తి చేసుంది. ఇలా చరిత్రలో 2026 ఆగస్టు 1 నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం విశేషం. సాధారణంగా విమానాశ్రయాలు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. కానీ కొన్ని ప్రాజెక్టులు మాత్రమే ఒక ప్రాంత ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సరిగ్గా అటువంటి ప్రాజ్టె! మౌలిక సదుపాయాల కల్పన ఏ ప్రాంత ఆర్థికాభివృద్ధికైనా పునాది వంటిది. ఈ ఆలోచనా సరళితోనే టమి ప్రభుత్వం భోగాపురం విమానాశ్రయాన్ని అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దింది. నిజానికి ఇది 2019లోపే పూర్తయి ఉంటే పరిస్తితి మరోలా ఉండేది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ మౌలిక వసతుల విప్లవంలో భోగాపురం ప్రాజెక్టు ఒక మచ్చుతునక! జాతీయ రహదారులు, రైల్వేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానం ద్వారా దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో ఇది మరో చరిత్రాత్మక విజయం. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భోగాపురం అనేది వలం ఒక కనెక్టివిటీ మాత్రమే కాదు. ఆత్మవిశ్వాసానికి, సరికొత్త అవకాశాలకు, ఉన్నత ఆశయాలకు సంతం. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్‌కు, పారిశ్రామిక ఆవిష్కరణలకు ఉత్తరాంధ్ర ఇప్పుడు చిరునామాగా నిలవనుంది. 2024లో ఎన్డీయే టమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ ప్రాజెక్టు మళ్లీ శరవేగంగా పట్టాలెక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించగా, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రాత్రింబవళ్లు పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.4,700 కోట్ల భారీ వ్యయంతో 2,700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే అత్యంత ఆధునిక గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులలో ఒకటి. ఇక్కడ నిర్మించిన 3.8 కిలోమీటర్ల సుదీర్ఘ 'కోడ్ 4ఈ' రన్‌వే ద్వారా భారీ అంతర్జాతీయ విమానాలు డా సునాయాసంగా ల్యాండ్ అవుతాయి. ప్రాథమికంగా ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా ఈ టెర్మినల్ రూపుదిద్దుకుంది. ప్రకృతి విపత్తులను సైతం తట్టుకునేలా అత్యున్నత ప్రమాణాలతో దీనిని నిర్మించారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో ఉత్తరాంధ్రలోని ఫార్మా, సీఫుడ్, పండ్లు, పూలు, వస్త్ర పరిశ్రమల ఎగుమతులకు అవకాశాలు పెరగడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**ప్రాథమికంగా ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా ఈ టెర్మినల్ రూపుదిద్దుకుంది. ప్రకృతి విపత్తులను సైతం తట్టుకునేలా అత్యున్నత ప్రమాణాలతో దీనిని నిర్మించారు. ఈ విమానాశ్ర యం అందుబాటులోకి రావడంతో ఉత్తరాంధ్రలోని ఫార్మా, సీఫుడ్, పండ్లు, పూలు, వస్త్ర పరిశ్రమల ఎగుమతులకు అవకాశాలు పెరగడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.**

EDITORIAL



## వైభవంగా శ్రీరామకోటి పుస్తకాల నిమజ్జనం

- **భద్రాచలంలో ఘనంగా నిత్యకల్యాణం**
- **భక్తులతో కిటకిటలాడిన ఆలయం**
- **మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య గోదావరిలో రామకోటి పుస్తకాల నిమజ్జనం**

**ప్రజానావ, భద్రాచలం:** భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం నిత్యపూజలు, నిత్యకల్యాణం, శ్రీరామకోటి పుస్తకాల నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటలకే ఆలయ అర్చకులు ఆలయ తలుపులు తెరిచి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఆరాధన, అర్చన, బాలభోగ నివేదన కార్యక్రమాలు నిర్వహించి స్వామివారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించి బేడ మండపంలో ప్రతిష్ఠించి పుణ్యాహవాచనం, యజ్ఞోపవీత ధారణ, ప్రవర పఠనం తదితర వైదిక క్రతువులతో నిత్యకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ప్రత్యేక సేవల్లో భాగంగా స్వర్ణ తులసీదళార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, ఆలయ ప్రాంగణం అంతా భక్తుల జై శ్రీరాం నినాదాలతో మార్మోగింది. ఆలయంలో భక్తులు సమర్పించిన శ్రీరామకోటి పుస్తకాలను మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ ప్రత్యేక రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లి పవిత్ర గోదావరి నదిలో ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కే. దామోదర్‌రావు, ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, సూపరింటెండెంట్ లింగాల సాయిబాబా, వేద పండితులు స్థలసాయి, ప్రధాన అర్చకులు విజయరాఘవన్, రామస్వరూప్, అమరవాది మురళి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.





# శాంతిస్తున్న గోదారమ్మ

- **తగ్గుముఖం పట్టిన వరద ఉధృతి**
- **గంట గంటకూ అడుగుమేర తగ్గుతున్న నీటిమట్టం**
- **పునరావాస కేంద్రాల్లో బాధితులు**
- **ఏజెన్సీలో కొనసాగుతున్న సహాయక చర్యలు**
- **కాలనీల్లో ఇంకా బ్యాక్‌వాటర్ ప్రభావం**

**ప్రజానావ, ఖమ్మం:** భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహించిన గోదావరి వరద క్రమంగా తగ్గుముఖం పడుతోంది. శనివారం రాత్రి 8 గంటల సమయానికి గోదావరి నీటిమట్టం 55.50 అడుగుల వద్ద కొనసాగుతుండగా మూడో ప్రమాద హెచ్చరిక అమల్లోనే ఉంది. అయితే ఎగువ ప్రాంతాల్లో వర్షాలు గణనీయంగా తగ్గడంతో నదిలోకి వస్తున్న వరద ప్రవాహం తగ్గిపోతోందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం గంట గంటకూ నీటిమట్టం అడుగుమేర తగ్గుతూ ఉండటంతో ఆదివారం ఉదయానికి గోదావరి నీటిమట్టం 49 అడుగులకు చేరే అవకాశముందని అంచనా వేస్తున్నారు. దీంతో జిల్లా యంత్రాంగం, ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నప్పటికీ ముంపు ప్రాంతాల ప్రజలు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. గత కొన్ని రోజులుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా గోదావరి, దాని ఉపనదుల నుంచి భారీగా వరద నీరు చేరి భద్రాచలం వద్ద నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరింది. నీటి మట్టం 43 అడుగులకు చేరినప్పుడు తొలి ప్రమాద హెచ్చరిక, 48 అడుగులకు చేరినప్పుడు రెండో ప్రమాద హెచ్చరిక, అనంతరం 53 అడుగులు దాటి 55.50 అడుగులకు చేరడంతో మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. వరద ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నా యి. వేలేరుపాడు మండలంలోని 15 గ్రామాలు, కుక్కునూరు మండలంలోని మూడు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. గొమ్ముగూడెం పంచాయతీ పరిధిలోని పది గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శబరి నది కూడా ఉప్పొంగడంతో చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఏటపాక మండలాల లోతట్టు గ్రామాలు జలదిగ్బం ధంలో చిక్కుకున్నాయి. ప్రధాన రహదారులపై నాలుగు నుంచి ఐదు అడుగుల మేర నీరు ప్రవహిం చడంతో అధికారులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. భద్రాచలం పట్టణంలోని అయ్యప్ప కాలనీ, సుభాష్‌నగర్‌తో పాటు కరకట్ట సమీపంలోని పలు కాలనీలు బ్యాక్‌వాటర్ ప్రభావానికి గురయ్యా యి. డ్రైనేజీల ద్వారా వరద నీరు కాలనీల్లోకి చేరడం తో అనేక కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టడంతో బ్యాక్‌వాటర్ ప్రభావం కూడా క్రమంగా తగ్గుతున్నప్పటికీ అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. వరద కారణంగా భద్రాచలం–చెర్ల, వాజేడు, వెంకటాపురం, బూర్గంపహా డ్–సారపాక ప్రధాన రహదారులపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం ప్రాంతాలకు వెళ్లే రహదారులు కూడా నీటమునిగిపోవడంతో పలు ఏజెన్సీ గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. చెర్ల మండలం సమీపంలో వరదలో చిక్కుకున్న సుమారు 70 మంది లారీ డ్రైవర్లు, క్లీనర్లు, స్థానికులను పోలీసులు, మత్స్యకారులు, రెస్క్యూ బృందాలు పడవలు, లైఫ్ జాకెట్ల సాయంతో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. సాహసోపేతంగా సహాయక చర్యలు చేపట్టిన పోలీసు బృందాన్ని స్థానికులు అభినందించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పర్యవేక్షణలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి ఆహారం, తాగునీరు, పాలు, వైద్య సేవలు అందిస్తున్నారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా రక్షణ పడవలతో సిద్ధంగా ఉన్నాయి. విద్యుత్, ఆరోగ్యం, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల అధికారులు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. అత్యవసర పనులు లేకుండా ప్రజలు బయటకు రావద్దని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, గోదావరి నదిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గిపోవడంతో వరద ప్రవాహం మరింత తగ్గే అవకాశముందని, ఆదివారం నాటికి పరిస్థితి సాధారణ స్థితికి చేరుకునే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

# ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధనకు కట్టుబడి ఉన్నాం

- **ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం మానుకోవాలి**
- **అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం**
- **ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**ప్రజానావ, ఆలేరు:** ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, దాని సాధనకు తాను పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నానని తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. శనివారం ఆలేరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆలేరు రెవెన్యూ డివిజన్ కోసం అఖిలపక్షాలు ధర్నా నిర్వహించడం ప్రజాస్వామ్య హక్కేనని, అయితే ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. గత పదేళ్లపాటు అధికారంలో ఉన్నవారు ఆలేరు రెవెన్యూ డివిజన్ అంశాన్ని ఎందుకు విస్మరించారో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఆ సమయంలో అసెంబ్లీలో ఈ అంశాన్ని ఎన్నిసార్లు ప్రస్తా వించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు చేయలేని పనిని ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. తాను ఆలేరు రెవెన్యూ డివిజన్ అంశాన్ని అసెంబ్లీలో రెండుసార్లు ప్రస్తావించానని, తిరుమలపూర్ బహిరంగ సభలోనూ ప్రజల ముందుకు తీసుకువెళ్లానని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో ప్రత్యేకంగా చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధించడమే తన లక్ష్యమని, ఈ అంశంపై నిరంతరం కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 25 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఆలేరును విస్మరించిందని విమర్శిస్తూ, ఇప్పుడు అదే పార్టీ నాయకులు నిరసనలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఆలేరు అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వం మల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ నిర్మాణం ప్రకటించినప్పటికీ అమలు చేయలేకపోయిందని, తమ ప్రభుత్వం మాత్రం 20 ఎకరాల్లో మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేసిందన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా సుమారు 500 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు 200 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల అమలులో ఆలేరు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వెల్లడించారు. గత పదేళ్లలో వచ్చిన నిధులతో పోలిస్తే కేవలం రెండున్నర సంవత్సరాల్లోనే సుమారు రూ.70 కోట్ల అభివృద్ధి నిధులను ఆలేరుకు తీసుకువచ్చామని తెలిపారు. రూ.44 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామని, అండర్‌పాస్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రతి మున్సిపాలిటీలో ఆధునిక మున్సిపల్ కార్యాలయ భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. బహదూర్‌పేట చెరువును రూ.2.50 కోట్లతో అభివృద్ధి చేశామని, వచ్చే నెలలో మరో రూ.10 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకురానున్నట్లు వెల్లడించారు. కొలనుపాక–కాల్వపల్లి వంతెన నిర్మాణ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతిపక్షాలు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయాలకు అతీతంగా సహకరించాలని, ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధనలో అందరూ కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విజ్ఞప్తి చేశారు. ఆలేరు అభివృద్ధే మా ధ్యేయం.. రెవెన్యూ డివిజన్ సాధనే మా లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం

- **స్కూల్ బస్సు విద్యార్థులు సురక్షితం**
- **డ్రైవర్ చాకచక్యంతో తప్పిన ముప్పు**

**ప్రజానావ, మెదక్:** నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో పుష్పల వాగు సమీపంలోని రహదారి కుంగిపోవడంతో శనివారం పెను ప్రమాదం తృటిలో తప్పింది. మెదక్ పట్టణంలోని డాన్ బాస్కో ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు వంతెన వద్దకు చేరుకోగా, రహదారి కింద మట్టి కూరుకుపోవడంతో బస్సు అదుపు తప్పి కిందకు జారిపోయే పరిస్థితి ఏర్పడింది. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బ్రేకులు వేయడంతో ప్రమాదాన్ని నివారించడమే కాకుండా, బస్సులో ఉన్న విద్యార్థులను సురక్షితంగా కిందకు దించి ప్రమాద ప్రాంతం నుంచి తరలించారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. బస్సు అధిక వేగంతో వచ్చి ఉంటే భారీ ప్రమాదం జరిగి ఉండేదని వారు పేర్కొన్నారు. గతంలో కూడా ఇదే రహదారి దెబ్బతిన్నప్పటికీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి శాశ్వత రహదారి మరమ్మతులు చేపట్టాలని, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే వంతెన, రహదారి పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- **చిలుకూరు మండలంలో విషాదం**
- **రెండు ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన ఘటన**
- **కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**





**ప్రజానావ, కోదాడ:** జాతీయ రహదారిపై చిలుకూరు మండల పరిధిలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతి చెందారు. సీతారాంపురం సమీపంలో కోదాడ వైపు నుంచి హుజూర్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డుపైకి ఎక్కుతున్న టాటా ఏస్ వాహనాన్ని ఢీకొనడంతో నరసింహ (20) అక్కడికక్కడే మృతి చెందగా, గోపీ తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడు, క్షతగాత్రుడు ఇద్దరూ బూరగడ్డ గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మరో ఘటనలో చిలుకూరు మండలం కవితా కళాశాల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో గడ్డం లోకేష్ (19), చల్లా అనిల్ (20) తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని షేర్ మహమ్మద్‌పేటకు చెందిన వారిగా గుర్తించారు. ఒకే రోజు జరిగిన ఈ రెండు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతి చెందడంతో నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు ఘటనాస్థలాలకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పుట్టిన బిడ్డకు తొలి టీకా తల్లిపాలే

- **ముర్రుపాలు శిశువుకు సంపూర్ణ రక్షణ**
- **తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి**
- **డీఎంహెచ్‌వో డాక్టర్ కే. కృష్ణ**
- **ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన**



**ప్రజానావ, నాగర్‌కర్నూల్:** పుట్టిన శిశువుకు జననం జరిగిన గంటలోపే తల్లిపాలు పట్టించడం తొలి టీకాతో సమానమని, బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. కృష్ణ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతల కోసం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రసవం జరిగిన వెంటనే శిశువుకు తల్లిపాలు పట్టించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ తేనె, చక్కెర నీరు, గ్లూకోజ్ నీరు వంటి ఇతర పానీయాలు ఇవ్వకూడదని సూచించారు. తొలి మూడు రోజులు వచ్చే ముర్రుపాలు శిశువులో రోగనిరోధక శక్తిని పెంపొందించి, తొలి ఆరు నెలల వరకు నీళ్ల విరేచనాలు, న్యూమోనియా వంటి అంటువ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని వివరించారు. పుట్టిన 48 గంటల తర్వాత కొందరు శిశువుల్లో కనిపించే ఫిజియాలజికల్ జాండీస్ తీవ్రతను తగ్గించడంలో కూడా తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి–బిడ్డల మధ్య అనుబంధం బలపడటంతో పాటు శిశువులో భద్రతాభావం పెరుగుతుందని చెప్పారు. తొలి ఆరు నెలల పాటు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం తల్లిపాలతో పాటు వయస్సుకు తగిన అదనపు పోషకాహారాన్ని ప్రారంభించాలని సూచించారు. తల్లిపాలు తాగే పిల్లల్లో భవిష్యత్తులో అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం వంటి సమస్యల ప్రమాదం తగ్గుతుందని పేర్కొన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లులకు రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, ఎముకల బలహీనత వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు తగ్గడమే కాకుండా ప్రసవానంతరం త్వరగా బరువు తగ్గడానికి, తొలి ఆరు నెలల వరకు సహజ గర్భనిరోధకంగా కూడా ఉపయోగపడుతుందని వివరించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ సౌమ్య బాలింతల్లో పాలు సమృద్ధిగా రావడానికి తీసుకోవాల్సిన ఆహారం, తాగాల్సిన నీటి పరిమాణం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ రవిశంకర్, డాక్టర్ అజిత్, పీడియాట్రిషన్ డాక్టర్ సిరాజుద్దీన్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆర్. సురేష్‌బాబు, డాక్టర్ కే. రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో భరత్‌కుమార్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ సృజనతో పాటు వివిధ విభాగాల అధికారులు రాజగోపాలచారి, రేనయ్య, కొర్ర నిరంజన్, కుమార్, దివ్య తదితరులు పాల్గొన్నారు.




## మణుగూరు పీకే–2 డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి

- జెన్‌కోను వేలంపాటలో పాల్గొనకుండా అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఏఐటీయూసీ విజ్ఞప్తి
- సింగరేణి మనుగడ, కార్మికుల ఉపాధి, తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ బాధ్యత: సీతారామయ్య, రాజ్‌కుమార్

**ప్రజానావ, రామగుండం:** మణుగూరు పీకే–2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను నేరుగా సింగరేణికే కేటాయించాలని, జెన్‌కోను వేలంపాట (ఆక్షన్) ప్రక్రియలో పాల్గొనకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి–గుర్తింపు సంఘం) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలు సింగరేణి కార్మికుల ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. మణుగూరు పీకే–2 డీప్ సైడ్ బ్లాక్ సింగరేణి మనుగడకు అత్యంత కీలకమైన బొగ్గు నిల్వల ప్రాంతమని, వేలాది మంది కార్మికుల ఉపాధి, భద్రత, భవిష్యత్తు ఈ బ్లాక్‌పైనే ఆధారపడి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్, ఏఐటియుసి రాష్ట్ర నాయకులు కే. వెంకటేష్, ఎస్. నర్సింగ్‌రావు, కే. బీరయ్య, ఎ. ప్రభాకర్, ఎం. రాజనర్సు తదితరులు పాల్గొన్నారు

## జూలైలో ఆశాజనకంగా ఆర్జీ–1 ఏరియా పనితీరు

- 3.03 లక్షల టన్నుల బొగ్గు డిస్‌పాచ్
- ఓబీ తొలగింపులో 95 శాతం లక్ష్య సాధన
- జీఎం లలిత్‌కుమార్



**ప్రజానావ, రామగుండం:** రామగుండం–1 ఏరియా జూలై నెలలో ఉత్పత్తి, బొగ్గు రవాణా, కార్మిక సంక్షేమం, భద్రత, వైద్య సేవలు, పర్యావరణ పరిరక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో ఆశాజనక పురోగతి సాధించిందని ఆర్జీ–1 జనరల్ మేనేజర్ లలిత్‌కుమార్ తెలిపారు. శనివారం జూలై నెలలో భూగర్భ, ఉపరితల గనుల పనితీరుకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ, ఏరియా నుంచి మొత్తం 3,03,367 టన్నుల బొగ్గును డిస్‌పాచ్ చేసినట్లు చెప్పారు. ఓబీ తొలగింపు పనుల్లో 15.70 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 14,94,293 క్యూబిక్ మీటర్లు పూర్తి చేసి 95 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. పర్సనల్ విభాగం ద్వారా హౌస్ బిల్డింగ్ లోన్, సీఎపీఆర్ఎంఎస్, టెర్మినల్ బెనిఫిట్స్, కారుణ్య నియామకాల దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయ డంతో పాటు ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలను నిరంతరాయం గా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రామగుండం ఏరియా ఆసుపత్రిలో హైదరా బాద్ ఓజోన్ హాస్పిటల్ వైద్య నిపుణులతో సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఉత్పత్తి, భద్రత, కార్మిక సంక్షేమం, వైద్య సేవలు, పర్యావరణ పరిరక్షణ, నైపుణ్యాభివృద్ధి, సామాజిక బాధ్యత కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయడం వల్ల జూలై నెలలో అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని అధికారులు తెలిపారు.

Singareni news

## మణుగూరు డిప్‌సెడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి

- సింగరేణి భవిష్యత్తు, కార్మికుల ఉపాధి పరిరక్షణకు కొత్త గనుల అభివృద్ధి అవసరం: డా. జనక్ ప్రసాద్




**ప్రజానావ, రామగుండం:** మణుగూరు డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనల్లో భాగంగా శనివారం సాయంత్రం ఆర్‌జీ–1 జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ ఆర్‌జీ–1 వైస్ ప్రెసిడెంట్ కె. సదానందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ భవిష్యత్తు, తెలంగాణ ఇంధన భద్రత, లక్షలాది కార్మిక కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మణుగూరు డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే నాలుగేళ్లలో సింగరేణికి దక్కే అవకాశమున్న 13 కొత్త మైనింగ్ ప్రాజెక్టులను వేగంగా అభివృద్ధి చేయాలని, వాటి సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ మహాధర్నాలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి, జనరల్ సెక్రటరీలు వికాస్ కుమార్ యాదవ్, లక్ష్మీ పతి గౌడ్, వైస్ ప్రెసిడెంట్ దాస్, రీజినల్ జనరల్ సెక్రటరీ ఆరేపల్లి శ్రీనివాస్, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు గడ్డం కృష్ణ, గుళ్ల మల్లికార్జున్, మంద రమేష్, బేబీ శ్రీనివాస్, బ్రాంచ్ సెక్రటరీలు ఎదులాపురం శ్రీనివాస్, గుండేటి శ్రీనివాస్, కుషనపల్లి శంకర్, కట్రోజు మోహన్, పిట్ సెక్రటరీలు రమేష్, గాదె సంపత్, అన్వేష్, మురళి, సదానందం, రాజు, కుమారస్వామి, పూసల శ్రీనివాస్, వినయ్, రాజయ్య, బైసా బాపు, తాటి రాజయ్య, మహిళా నాయకురాలు లలిత, అనిల్, గట్టు రాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## వేములవాడ భీమేశ్వర ఆలయంలో ముగిసిన వరుణయాగ మహోత్సవాలు

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లోకకళ్యాణం, సకాలంలో వర్షాలు కురవాలని సంకల్పిస్తూ నిర్వహించిన మూడు రోజుల వరుణయాగ మహోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. మహోత్సవాల్లో భాగంగా వాస్తు హోమం, నవగ్రహ హోమం, వరుణ పర్జన్య జపాలు, ధారాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. చివరి రోజు పూర్ణాహుతి అనంతరం 108 కలశాలతో ప్రత్యేక అభిషేకాలు, మహామంగళహారతి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఎల్. రమాదేవి రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.




## నేరాల నియంత్రణకు సమర్ధవంతంగా పనిచేయాలి

### ఎస్పీ మహేష్ బీ గీతె

**ప్రజానావ, వేములవాడ :** నేరాల నియంత్రణకు గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్ధవంతంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, పెట్రోలింగ్, రౌడీషీటర్లపై నిఘా తదితర అంశాలను సమీక్షించారు. మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల నివారణపై గ్రామీణ యువతకు అవగాహన కల్పించాలని, బ్లూ కోల్ట్, పెట్రోకార్ సిబ్బంది గ్రామాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలను భాగస్వాములను చేసి నేరాల నియంత్రణలో వాటి ప్రాధాన్యతను వివరించాలని తెలిపారు. ఈ తనిఖీలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్టంగా
# సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- గోదావరి జలాల వినియోగంపై సమగ్ర అధ్యయనం చేస్తున్నాం
- ఎల్లంపల్లి రిజర్వాయర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మితమైన ప్రాజెక్టు
- మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయొద్దని ఎన్‌డీఎస్‌ఏ సూచించింది
- ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను సందర్శించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజానావ, పెద్దపల్లి :** ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్టంగా సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకు గోదావరి నదిపై నిర్మితమైన వివిధ ప్రాజెక్టులను పరిశీలిస్తూ నీటి లభ్యత, ప్రవాహ పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 1963లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారని, 1959లో కడెం ప్రాజెక్టుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన జరిగిందన్నారు. 2004 జూలై 28న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా రైతులకు సాగునీరు అందిస్తుండగా, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో మెజారిటీ పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్టుకు దివంగత శ్రీపాదరావు పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. ఎల్లంపల్లి రిజర్వాయర్ అప్పటి ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉండేదని, ఇక్కడి నీటిని కాళేశ్వరం నీరుగా ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ పలు కారణాల వల్ల సాధ్యపడలేదన్నారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) మూడు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయవద్దని లిఖితపూర్వకంగా సూచించిందని తెలిపారు. ఇటీవల జరిగిన సాంకేతిక సమావేశంలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), ఎన్‌డీఎస్‌ఏ అధికారులు కూడా నిపుణుల కమిటీ సూచనల మేరకు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారని పేర్కొన్నారు. డీపీఆర్ ప్రకారం షీట్‌పైల్ ఫౌండేషన్ నిర్మించాల్సి ఉండగా స్కాంట్ పైల్ ఫౌండేషన్ నిర్మించారని, మూడు బ్యారేజీల పునాదుల నాణ్యతపై నిపుణులు అభ్యంతరాలు వ్యక్తం చేశారని తెలిపారు. గత రెండు నెలలుగా ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచనల మేరకు మూడు బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు గంట గంటకు నీటిని ఎత్తిపోస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నీటిపారుదల రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ దేవాదుల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు – రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో పూర్తి చేయలేదని విమర్శించారు. ఉత్తర తెలంగాణ రైతుల ప్రయోజనాలే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి, గత 34 నెలలుగా కాళేశ్వరం మూడు బ్యారేజీల నుంచి ఒక్క చుక్క నీటిని కూడా ఎత్తిపోక పోయినా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించి 340 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధించామని, 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.80 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులను సందర్శించి ప్రస్తుత జలస్థితిని పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నా మని తెలిపారు. ప్రకృతి అనుగ్రహంతో మంచి వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండుతున్నాయని, రైతులకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితులను వివరించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తోందన్నారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడానికి ఎన్‌డీఎస్‌ఏ అనుమతించలేదని, దీనిపై అనవసర రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు నీటి తరలింపు పనులు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగమేనని, మిడ్ మానేరు, ఫ్లడ్ ఫ్లో కాలువ కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించబడినవేనని పేర్కొన్నారు. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు నాసి రకంగా నిర్మించడంతోనే దెబ్బతిన్నాయని అన్నారు. గురుత్వాకర్షణ ద్వారా నీరు వచ్చే అవకాశము న్నప్పటికీ భారీ ఎత్తిపోతల ద్వారా వేల కోట్ల రూపా యల విద్యుత్ వ్యయం జరిగేలా ప్రాజెక్టు రూపొం దించారని విమర్శించారు. నీటిపారుదల రంగంలో తుగ్లక్ నిర్ణయాలతో లక్షల కోట్ల రూపాయలు వృథా అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, గడ్డం వినోద్ కుమార్, వెడ్మ బొజ్జు , మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం..
# పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ

- జిల్లాలో 87.42 శాతం అన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి
- 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ
- సిరిసిల్ల కలెక్టర్ గరిమ అగ్రవాల్




**ప్రజానావ, సిరిసిల్ల :** ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం జిల్లాలో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. పోలింగ్ స్టేషన్ల హేతబద్ధీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి కలెక్టర్ శనివారం సమీక్ష నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్, ఓటర్ల నమోదు, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా వివరించారు. జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల పరిధిలో మొత్తం 549 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇందులో వేములవాడ నియోజకవర్గంలో 262, సిరిసిల్ల నియోజకవర్గంలో 287 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వివరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం 1200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లు లేవని తెలిపారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 10వ తేదీ వరకు ఎన్నికల సంఘం పొడిగించిందని, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా జరుగుతుందని, ఇప్పటికే జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ 87.42 శాతం పూర్తయిందని వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని, అదే రోజు నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ వివరించారు. క్లెయిమ్స్, అభ్యంతరాలపై నోటీసుల జారీ, పరిష్కార ప్రక్రియ ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు కొనసాగుతుందని, అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు.

### 17 నుండి కొత్త, బదిలీ ఓటర్ల దరఖాస్తుల స్వీకరణ

ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదై ఉండరాదని జిల్లా కలెక్టర్ తెలిపారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం–6 ద్వారా, అదే నియోజకవర్గం లేదా ఇతర నియోజకవర్గానికి ఓటును బదిలీ (షిఫ్టింగ్) చేసుకోవాలనుకునే వారు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆగస్టు 17వ తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు ఈ దరఖాస్తులను సమర్పించవచ్చని అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సహకారం అందించాలని అన్నారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు శ్రీధర్ బాబు, కెవిస్బి.కుమారి, పర్యవేక్షకులు ప్రవీణ్, ఎలక్షన్ విభాగం నాయబ్ తహసీల్దార్ రెహమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

- 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై 27 కేసులు నమోదు
- ఎస్పీ మహేష్ బి. గితే

**ప్రజానావ, సిరిసిల్ల :** బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నదని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే కోరారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ అనే కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కోసం ఈ సంవత్సరం జులై 1 నుండి 31 వరకు పోలీస్ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, రెవెన్యూ, హెల్త్ డిపార్ట్మెంట్, వివిధ శాఖల అధికారులతో జిల్లాలో టీమ్ లుగా ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 104 మంది బాలబాలికలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగిందని తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 27 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. తరుచు బాలల చేత పనులు చేయిస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. వీధి బాలలను చూసినప్పుడు స్థానిక పోలీస్ వారికి సమాచారం అందించాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేయడానికి సహకరించిన అన్ని శాఖల అధికారులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## విద్యార్థులకు సీఎం క్షమాపణ చెప్పాలి

**ప్రజానావ, జనగామ:** ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఉద్యమిస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు విద్యార్థి లోకాన్ని అవమానించేలా ఉన్నాయని, వాటిపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా యువ మోర్చా (బీజేపీవైఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం జనగామ పట్టణంలో బీజేపీవైఎం జనగామ శాఖ ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీవైఎం జిల్లా అధ్యక్షుడు హరీష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 40 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయిం బర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం పోరాడుతున్న సమయంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు అప్లికేషన్ రాయడం కూడా రాదంటూ ముఖ్యమంత్రి ఎగతాళి చేయడం బాధాకరమని అన్నారు. సీఎం వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్, కుమార్, చింతకింది సంతోష్, మనోజ్, కపిల్ ఆదిత్య, శరత్, అఖిల్, సంపత్, శ్రీకాంత్, భూపాల్, రాజు, నవీన్, సందీప్ పాల్గొన్నారు.

## జావెలిన్ త్రోలో జిల్లా ప్రథమ స్థానం సాధించిన బానోత్ నరేష్

### అభినందించిన సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్లలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ – 2026లో బానోత్ నరేష్ విశేష ప్రతిభ కనబరిచారు. సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాల లో బిఎస్‌సి (ఆనర్స్) అగ్రికల్చర్ చివరి సంవత్సరం చదువుతున్న బానోత్ నరేష్, మెన్స్ విభాగంలో జరిగిన జావెలిన్ త్రో పోటీలో పాల్గొని ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయిలో తన అత్యుత్తమ ప్రతిభతో 2026 రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 7న హనుమకొండలో జరగనున్నాయి. ఈ సందర్భంగా బీజేఆర్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల యాజమాన్యం, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది బానోత్ నరేష్‌కు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాల, జిల్లా అలాగే విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## 10న జైల్ భరో విజయవంతం చేయాలి



**ప్రజానావ, మంచిర్యాల :** చెన్నూరు మండలంలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 10న జైలు బరో విజయవంతం చేయాలని కరపత్రం ఆవిష్కరించారు. ఈ సదస్సులో బోడంకి చందు రైతు సంఘం జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ.. భారత వ్యవసాయ రంగంలోకి కేంద్ర బిజెపి ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని, జీరో సుంకాలతో దిగుమతులు రావడంతో దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోయి రైతులు దివాలా తీస్తున్నారని, కార్మిక వర్గం స్వాతంత్రం రాక ముందే పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దుచేసి దేశంలో పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు లాభాలను చేకూర్చడం కోసం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చారు. కేంద్రంలో యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో ఉన్నప్పుడు వామపక్షాల పోరాట ఫలితంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటి చట్టం అమలు చేయబడ్డది. నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించి దీని స్థానంలో వికసిత్ భారత్ గ్రామ్, జీ(వి బి జి,రామ్ జీ) మార్పు చేయడమే కాక, రాష్ట్రాల వాటా 10 శాతం నుండి, 40 శాతం నిధులను భరించాలని రాష్ట్రాల మీద భారం రుద్దాలని, కేంద్ర ప్రభుత్వం ఇదే అదునుగా భావించి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనిని ఎత్తివేయాలని కుట్రలు చేస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానాలకు వత్తాసు పలుకుతా ఉంది. అందులో భాగంగా 10 గంటల G.O తీసుకొచ్చింది. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి ఈ నెల ఆగస్టు 10 తేదీన జైల్ బరో కార్యక్రమానికి పెద్ద ఎత్తున వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు రైతులు, కార్మికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమారాణి, కరింభీ సిఐటియు నాయకురాలు, కృష్ణమాచారి, సమ్మక్క వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్మిక సంఘాల నాయకులు యామిని, మల్లికార్జున్, గట్టక్క, మౌనిక, దుర్గమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# కీవ్‌పై విరుచుకుపడ్డ రష్యా

- బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు
- తొమ్మిది మంది మృతి, 22 మందికి గాయాలు

**కీవ్:** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా శనివారం తెల్లవారుజామున బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో భారీ దాడులు జరిపింది. ఈ దాడుల్లో కనీసం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా, 22 మంది గాయపడ్డారు. నివాస భవనాలు, వాణిజ్య సముదాయాలు దెబ్బతినడంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. కీవ్‌లోని సొలోమియాన్స్కీ జిల్లాలో ఐదు అంతస్తుల అపార్ట్ మెంట్‌పై క్షిపణి శకలాలు పడటంతో భారీ అగ్నిప్ర మాదం చెలరేగింది. సహాయక బృందాలు భవనం పై అంతస్తుల్లో చిక్కుకుపోయిన 35 మందిని సురక్షి తంగా బయటకు తీసుకొచ్చాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ఇద్దరు చిన్నారులు సహా ఎనిమిది మంది గాయపడ్డారు. దార్నిట్స్కీ జిల్లాలో జరిగిన దాడుల్లో ఏడుగురు మృతిచెందగా, 14 మంది గాయపడ్డారు. ఇళ్లతో పాటు వాహనాలు, పరిపాలనా భవనాలు, ఇతర నిర్మాణాలు కూడా ధ్వంసమయ్యాయి. షెవ్‌చెంకివ్స్కీ జిల్లాలోని ఓ వాణి జ్య భవనంలో అగ్నిప్రమాదం సంభవించగా, నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ ఆస్తినష్టం జరిగింది.

### పేట్రియట్ వ్యవస్థలు కావాలి: జెలెన్స్కీ

రష్యా క్షిపణి దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు మరిన్ని పేట్రియట్ వైమానిక రక్షణ వ్యవస్థలు అందించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ అమెరికా, పాశ్చాత్య దేశాలను మరోసారి కోరారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో జరిగిన సమావేశాల్లోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిపారు. ఇదిలాఉంటే ఈ దాడికి రెండు రోజుల ముందే ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన భారీ క్షిపణి, డ్రోన్ దాడుల్లో 10 మంది మరణించగా, 50 మందికిపైగా గాయపడ్డారు. ఆ దాడుల్లో ఒక క్షిపణి పోలాండ్ గగనతలంలోకి ప్రవేశించడం అంతర్జాతీయ ఆందోళ నకు దారితీసింది. తాజా దాడుల నుంచి ప్రాణాలతో బయటపడిన 64 ఏళ్ల లియుద్మిలా నకోనెచ్నా మాట్లాడుతూ, అర్ధరాత్రి భారీ పేలుళ్లతో ఒక్కసారిగా మేల్కొన్నానని, క్షిపణి ప్రభావంతో ఇంటి కిటికీలు ధ్వంసమయ్యాయని, బాత్రూం తలుపు ఊడిపడి కాలికి గాయమైందని తెలిపారు. నిరంతర దాడులతో ప్రజలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# జనన, మరణాల నమోదుకు కొత్త రూల్స్

- సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- రెండేళ్లు దాటితే కోర్టు అనుమతి తప్పనిసరి



**న్యూఢిల్లీ:** జననాలు, మరణాల నమోదును మరింత కచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జనన–మరణాల నమోదు (సవరణ) బిల్లు–2026కు లోక్‌సభ శుక్రవారం ఆమోదం తెలిపింది. జూలై 20న పార్లమెంట్ ముట్టడికి ప్రయత్నించిన విద్యార్థులపై పోలీసుల చర్యలను నిరసిస్తూ ప్రతిపక్ష సభ్యులు సభలో ఆందోళన కొనసాగించిన నేపథ్యంలో, బిల్లుపై చర్చ జరగకుండానే మూజువాణి ఓటుతో ఆమోదించారు. మధ్యాహ్నం సభ తిరిగి సమావేశమైన తర్వాత బీజేపీ ఎంపీ దిలీప్ సైకియా అధ్యక్షతన బిల్లును పరిశీలనకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు సభ మధ్యలోకి వచ్చి నినాదాలు చేస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు హాజరు కావాలని డిమాండ్ చేశారు. గందరగోళం మధ్యే బిల్లును ఆమోదించారు.

### చర్చకు దూరంగా ఉండటం సరికాదు: రిజిజు

ప్రజలకు ఉపయోగపడే కీలకమైన బిల్లుపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రతిపక్షం సహకరించకపోవడం విచారకరమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వ్యాఖ్యానించారు. ప్రజలు తమను చర్చల్లో పాల్గొనాలని పార్లమెంట్‌కు పంపించారని, భవిష్యత్తులో సభా కార్యకలాపాలకు సహకరించాలని ప్రతిపక్ష సభ్యుల కు సూచించారు. సభాపతి స్థానంలో ఉన్న దిలీప్ సైకియా కూడా ప్రతిపక్షం సహకారం లేకుండానే బిల్లును ఆమోదించాల్సి రావడం దురదృష్టకరమని అన్నారు. అనంతరం సభను రోజంతా వాయిదా వేశారు.

### కొత్త నిబంధనలివే

1969 జనన–మరణాల నమోదు చట్టంలో సవరణలు చేస్తూ ఈ బిల్లును రూపొందించారు. జననాలు, మరణాలను నిర్ణీత గడువులో నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు ఆలస్య నమోదుపై మరింత కఠిన నిబంధనలు తీసుకొచ్చారు. సవరించిన చట్టం ప్రకారం, జననం లేదా మరణం జరిగిన రెండేళ్ల తర్వాత నమోదు చేయాలంటే ప్రథమ శ్రేణి న్యాయ మేజిస్ట్రేట్ ఉత్తర్వు తప్పనిసరి. రెండేళ్ల లోపు ఆలస్య నమోదులకు మాత్రం జిల్లా మేజిస్ట్రేట్, ఉపవిభాగ మేజిస్ట్రేట్ లేదా అధీకృత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అనుమతి కొనసాగుతుంది. అదేవిధంగా, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అనే నిర్వచనాన్ని భారతీయ నాగరిక సురక్షా సంహిత–2023కు అనుగుణంగా సవరించారు.

### రాజ్యసభ ఆమోదం తర్వాత అమల్లోకి

లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ సవరణ బిల్లు ఇప్పుడు రాజ్యసభకు వెళ్లనుంది. అక్కడ కూడా ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా అమల్లోకి రానుంది. కొత్త చట్టం ద్వారా జనన, మరణాల నమోదులో జాప్యాన్ని తగ్గించి, రికార్డుల విశ్వసనీయతను మరింత బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

## పేపర్ లీకేజ్ బిల్లుకు చట్టబద్ధత

- ప్రజా పరీక్షల సవరణ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం
- పరీక్షల్లో అక్రమాలపై కేంద్రం కొరడా
- లీకేజీ కేసులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు

**న్యూఢిల్లీ :** ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, ఇతర అక్రమాలను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా పరీక్షలు (అక్రమ మార్గాల నిరోధక) సవరణ చట్టం–2026 అమల్లోకి వచ్చింది. ఈ చట్టానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో శుక్రవారం కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇటీవల పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదంతో చట్టరూపం దాల్చింది. కొత్త చట్టం ప్రకారం ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే, ఇలాంటి కేసుల దర్యాప్తును రెండు నెలల్లోగా పూర్తి చేయడం తప్పనిసరి చేశారు. దీంతో నిందితులపై త్వరితగతిన విచారణ పూర్తిచేసి శిక్షలు అమలు చేసే అవకాశం ఏర్పడనుంది. ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన లేదా పరీక్షల్లో అక్రమ మార్గాలను అనుసరించిన వ్యక్తులకు కనీసం ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష, అలాగే రూ.50 లక్షల వరకు జరిమానా విధించేలా చట్టంలో నిబంధనలు చేర్చారు. ఇక ప్రశ్నపత్రాల లీకేజీలను వ్యవస్థీకృతంగా నిర్వహించే ముఠాలపై మరింత కఠిన చర్యలకు చట్టం అవకాశం కల్పించింది. అలాంటి నేరాల్లో దోషులుగా తేలితే కనీసం ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 కోట్ల వరకు జరిమానా విధించనున్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించడం, ప్రశ్నపత్రాల లీకేజీల కు అడ్డుకట్ట వేయడం, అభ్యర్థుల్లో నమ్మకాన్ని బలోపేతం చేయడమే ఈ సవరణ చట్టం ప్రధాన ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

## నాలుగేళ్ల బాలికపై అత్యాచారం

### హత్య కేసులో నిందితుడికి మరణశిక్ష

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా జాట్ తాలూకా కరజాగి గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో నిందితుడు పాండురంగ్ సోమ్నా కల్లి (46)కి ప్రత్యేక పోక్సో కోర్టు మరణశిక్ష విధించింది. గత ఏడాది జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. చిన్నారిని ఇంటికి తీసుకెళ్లిన నిందితుడు ఆమెపై లైంగిక దాడికి పాల్పడి, అనంతరం హత్య చేసి మృతదేహాన్ని తన ఇంట్లోనే దాచిపెట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వేగంగా దర్యాప్తు పూర్తి చేసి, ఫోరెన్సిక్ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు తదితర కీలక సాక్ష్యాలతో ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా సమర్పించిన ఆధారాలను పరిశీలించిన ప్రత్యేక పోక్సో కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ మరణశిక్ష విధించింది.చిన్నారిపై అత్యంత దారుణంగా నేరానికి పాల్పడినందున ఇది అరుదైన కేసుగా పరిగణించిన కోర్టు ఈ తీర్పు వెలువరించింది.

# మోదీజీ.. నాకు 15ఏళ్లే!

- ఇతరుల ప్రేరణతో అలా మాట్లాడాను
- ఇదే నా తొలి, చివరి తప్పు.. ఇకపై ఇలాంటి పని చేయను
- నేను ఏ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదు
- నెట్టింట్లో వైరల్‌గా మారిన బాలిక వీడియో

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీని దూషిస్తూ వైరల్‌గా మారిన వీడియోలో కనిపించిన అదే బాలికగా చెబుతున్న 15 ఏళ్ల ఓ బాలిక శనివారం సోషల్ మీడియాలో క్షమాపణ వీడియో విడుదల చేసింది. తాను ఇతరుల ప్రభావానికి లోనై ఆ వ్యాఖ్యలు చేశానని, జరిగిన ఘటనపై తీవ్ర పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. అయితే, ఈ క్షమాపణ వీడియో ప్రామాణికతను స్వతంత్రంగా నిర్ధారించ లేదని పీటీఐ వెల్లడించింది. జులైలో స్నేహితులతో కలిసి ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌కు వెళ్లినప్పుడు ప్రధాని మోదీపై అసభ్య పదజాలంతో మాట్లాడుతున్న కొందరిని కలిశానని బాలిక వీడియోలో తెలిపింది. వారి ప్రేరణతో తానూ అదే పదాలు పునరావృతం చేశానని పేర్కొంది. వైరల్ అయిన వీడియోను తాను సోషల్ మీడియాలో పోస్టు చేయలేదని, ప్రస్తుతం దేశ ప్రజలందరికీ క్షమాపణ చెబుతున్నానని తెలిపింది. నాకు కేవలం 15 ఏళ్లు మాత్రమే. ఇదే నా తొలి, చివరి తప్పు. ఇకపై ఇలాంటి పని చేయను అని వీడియోలో పేర్కొంది.

### కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు

ఈ క్షమాపణ వీడియో వెలుగులోకి రావడానికి ముందే బాలికపై పోలీసులకు ఫిర్యాదు నమోదైంది. జులై 29న నోయిడాలో నమోదైన జీరో ఎఫ్ఐఆర్‌ను ఢిల్లీ పోలీసులకు బదిలీ చేశారు. ఘటన ఢిల్లీలో చోటుచేసుకున్నందున కేసు వివరాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. వైరల్ వీడియోపై ఇప్పటికే కేసు నమోదు చేసిన పోలీసులు, వీడియోను తొలగించాలని సామాజిక మాధ్యమ వేదిక **ఎక్స్**కు నోటీసులు జారీ చేయడంతో పాటు దర్యాప్తుకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని ఆదేశించారు.

### బాధ కలిగించింది

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం విడుదల చేసిన వీడియో సందేశంలో స్పందించారు. జంతర్‌మంతర్ నిరసన సందర్భంగా తనతో పాటు తన దివంగత తల్లిపై కూడా అసభ్య పదజాలం ఉపయోగించడం బాధ కలిగించిందని పేర్కొన్నారు. అయితే, దారి తప్పిన పిల్లలను క్షమించి, వారికి సరైన మార్గం చూపాలని ఆయన సూచించారు.

## జాతీయత తేలకపోతే బహిష్కరణ అసాధ్యం

- స్వదేశం ధ్రువీకరణ, అంగీకారం తప్పనిసరి
- సుప్రీంకోర్టుకు స్పష్టం చేసిన కేంద్రం
- ప్రయాణ పత్రాలు లేకుండా విదేశీయులను పంపించలేమని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** జాతీయత నిర్ధారణ కాని విదేశీ పౌరులను వారి స్వదేశం గుర్తించి స్వీకరించేందుకు అంగీకరించనంత వరకు బహిష్కరించడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. అసోంలో విదేశీయులు గా ప్రకటించిన వ్యక్తులను బహిష్కరించే అవకాశం లేకపోయినా నిరవధికంగా నిర్బంధంలో ఉంచడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేంద్రం తన వైఖరిని వెల్లడించింది. జాతీయత తెలియని లేదా ధ్రువీకరించబడని విదేశీయుడిని అతని స్వదేశం పౌరుడిగా గుర్తించి, అతడిని స్వీకరించేందుకు అంగీకరించిన తర్వాతే బహిష్కరణ ప్రక్రియ చేపట్టవచ్చని కేంద్రం పేర్కొంది. జాతీయత నిర్ధారణ లేకుండా బహిష్కరణకు సంబంధించిన చర్యలు ప్రారంభించే అవకాశం లేదని అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. శిక్ష పూర్తయిన తర్వాత లేదా కోర్టు విచారణ ముగిసిన అనంతరం, సంబంధిత వ్యక్తి వద్ద చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టు లేదా ఇతర ప్రయాణ పత్రాలు ఉండి, అతనిపై మరే ఇతర క్రిమినల్ కేసులు పెండింగ్‌లో లేకపోతే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పాలిత ప్రాంతం లేదా విదేశీయుల ప్రాంతీయ నమోదు కార్యాలయం (ఎఫ్ఆర్ఆర్వో) ద్వారా బహిష్కరణ చేపట్టవచ్చని తెలిపింది. అయితే, బహిష్కరణకు ముందు సంబంధిత దేశ రాయబార కార్యాలయం లేదా హైకమిషన్ ద్వారా జాతీయతను ధ్రువీకరించి, అవసరమైన ప్రయాణ పత్రాలను తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వివరించింది.



# 19 ఏళ్ల తర్వాత కోల్‌కతాకు తస్లీమా

- ఎప్పుడైనా రండి.. పూర్తి భద్రత కల్పిస్తాం
- భావ ప్రకటనా స్వేచ్ఛకు రాష్ట్రంలో సంపూర్ణ రక్షణ
- బెంగాల్ సీఎం సువేందు అధికారి

**కోల్‌కతా :** దాదాపు 19 ఏళ్ల అనంతరం కోల్‌కతాలో అడుగుపెట్టిన బంగ్లాదేశ్‌కు చెందిన ప్రవాస రచయిత్రి తస్లీమా నస్రీన్‌కు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఘన స్వాగతం పలికారు. రాష్ట్రానికి ఆమె ఎప్పుడు వచ్చినా పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. శనివారం రవీంద్ర సదన్‌లో జరిగిన మతోన్మాద వ్యతిరేక సాహిత్య సదస్సులో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో భావ ప్రకటనా స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులకు సంపూర్ణ రక్షణ ఉందన్నారు. తస్లీమా కోల్‌కతాకు తిరిగి రావడం ప్రజాస్వామ్య విలువలు, భావ ప్రకటనా స్వేచ్ఛ పునరుద్ధరణకు నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయ చిత్రపటాన్ని బహూకరించారు. 2007లో తన ఆత్మకథ ద్విఖండితోపై వివాదాలు, నిరసనల నేపథ్యంలో తస్లీమా కోల్‌కతాను వీడాల్సి వచ్చింది. 1994లో బంగ్లాదేశ్‌లో మతోన్మాద సంస్థల బెదిరింపులతో దేశం విడిచిన ఆమె అప్పటి నుంచి ప్రవాస జీవితం గడుపుతున్న విషయం తెలిసిందే.

# వ్యక్తిగతం కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యం

- యువత జాతీయ ప్రయోజనాల కోసం అంకితభావంతో పనిచేయాలి
- జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్
- కేంద్ర హోంమంత్రి చేతులమీదుగా జాతీయ పురస్కారం




**పుణె:** వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకే అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ యువతకు పిలుపునిచ్చారు. దేశ నిర్మాణంలో భాగస్వాములై, జాతీయ ప్రయోజనాల కోసం అంకితభావంతో పనిచేయాలని సూచించారు. భారతదేశం ప్రస్తుతం చరిత్రలో అత్యంత కీలకమైన దశలో ఉందని, ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని బలమైన దేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. పుణెలోని లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ అందజేసే లోక్‌మాన్య తిలక్ జాతీయ పురస్కారం–2026ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా అందుకున్న అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో దోవల్ ప్రసంగించారు. నేటి యువత చిన్నచిన్న వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి దేశ ప్రయోజనాల కోసం అంకితభావంతో పనిచేయాలి. దేశం బలపడటమే మనందరి ప్రధాన లక్ష్యం కావాలి. చరిత్రలో ఇలాంటి అవకాశాలు చాలా అరుదుగా వస్తాయి. వాటిని కోల్పోయే పరిస్థితి ఉండకూడదు అని ఆయన అన్నారు.

### హక్కులతో పాటు బాధ్యతలూ ముఖ్యం

స్వేచ్ఛ అంటే ఇష్టానుసారంగా వ్యవహరించడం కాదని, హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుంచుకోవాలని దోవల్ యువతకు సూచించారు. స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. లోక్‌మాన్య బాలగంగాధర్ తిలక్ దేశభక్తి, త్యాగస్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు.

### వీఈడీ సూత్రంతో నిర్ణయాలు

వ్యూహాత్మక నిర్ణయాల్లో వైటల్, ఎసెన్షియల్, డిజైరబుల్ అనే వీఈడీ సూత్రాన్ని అనుసరిస్తామని దోవల్ తెలిపారు. జాతీయ ప్రయోజనమే అత్యంత కీలకమని, మిగిలిన అంశాలు దాని తర్వాతే వస్తాయని స్పష్టం చేశారు. భారత్‌కు ఇంకా అంతర్గత, బాహ్య సవాళ్లు ఉన్నాయని పేర్కొన్న దోవల్, దేశ అభివృద్ధిని అడ్డుకోవాలనే శక్తులను ప్రజలంతా ఏకతాటిపై నిలిచి ఎదుర్కోవాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో భారత్ మరింత శక్తివంతమైన దేశంగా ఎదుగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## వాహనదారులకు స్వేచ్ఛ కల్పించాలి

- పెట్రోల్ బంకుల్లో రెండు రకాల ఇంధనం విక్రయించాలి
- ఈ20తో పాటు ప్యూర్ పెట్రోల్ కూడా అందుబాటులో ఉంచాలి: కేజ్రీవాల్
- ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో ఈ20 ఇంధనంతో పాటు స్వచ్ఛమైన (ప్యూర్) పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉంచి, వాహన దారులు తమకు నచ్చిన ఇంధనాన్ని ఎంచుకునే స్వేచ్ఛ కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ20 పెట్రోల్‌ను తక్కువ ధరకే విక్రయిం చడంతో పాటు సాధారణ పెట్రోల్ ధరలను కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని కాన్స్టి ట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన ఈ20 ఇంధనంపై టౌన్‌హాల్ సమావేశంలో మాట్లాడిన ఆయన, ప్రజల నుంచి వినతిపత్రాలు సేకరించి ఆగస్టు 4న ప్రధాని నివాసానికి వెళ్లి వాటిని సమర్పిస్తామని తెలిపారు. ఈ20 ఇంధనం వాహనాలకు ఎలాంటి నష్టం కలి గించదని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, అయితే ఆ వాదనకు ఆధారమైన అధ్యయన నివేదికను బహిరంగపరచాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించిన తర్వాతే ఈ20 వినియోగంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఇవ్వాలని అన్నారు.

## మెడికల్ కాలేజీలో అనుమానాస్పద నోట్

**అయోధ్య:** అయోధ్యలోని రాజర్షి దశరథ్ అటానమస్ స్టేట్ మెడికల్ కాలేజీ ఎక్స్‌రే విభాగంలో బాంబు తయారీకి సంబంధించిన వివరాలున్నట్లు భావిస్తున్న చేతిరాత నోట్ లభించడంతో పోలీసులు ప్రథమ సంవత్సరం పారామెడికల్ విద్యార్థి సర్ఫరాజ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రాథమిక విచారణలో తాను ల్యాప్‌టాప్‌లో ఓ సినిమా చూస్తూ అందులో చూపించిన వివరాలను కాగితంపై రాసుకున్నానని విద్యార్థి చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అతడి వాదనను ధృవీకరిస్తున్నామని వెల్లడించారు. ఘటనపై ఎస్‌టీఎఫ్, ఎస్ఓజీ, స్పెషల్ బ్రాంచ్, ఐబీ అధికారులు విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఎలాంటి అరెస్టు చేయలేదని, కేసు నమోదు చేయలేదని పోలీసులు స్పష్టం చేశారు. దర్యాప్తు కొనసాగుతోంది.

# భారీగా తగ్గిన కమర్షియల్ గ్యాస్ ధర

- 19 కిలోల ఎల్పీజీ సిలిండర్‌పై రూ.192 తగ్గింపు
- విమాన ఇంధనం లీటరుకు రూ.5 పెంపు
- గృహ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథం



**న్యూఢిల్లీ:** హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వరంగ చమురు సంస్థలు శనివారం రూ.192 మేర తగ్గించాయి. మరోవైపు విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరను లీటరుకు రూ.5 పెంచాయి. అంతర్జాతీయ ముడి చమురు ధరలు, విదేశీ మారకపు విలువల్లో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకుని ఈ సవరణలు చేపట్టినట్లు సంస్థలు తెలిపాయి. తాజా తగ్గింపుతో ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,930 నుంచి రూ.2,738కు చేరింది. జూలై 1న రూ.183.50 తగ్గించిన తర్వాత వరుసగా రెండో నెల కూడా కమర్షియల్ సిలిండర్ ధరలు తగ్గడం విశేషం. అలాగే మార్కెట్ ధరల ఆధారంగా విక్రయించే 5 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.808.50 నుంచి రూ.762కు తగ్గించారు. అయితే గృహ వినియోగానికి ఉపయోగించే 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుతం అది రూ.942గానే కొనసాగుతోంది. అలాగే పెట్రోల్, డీజిల్ ధరలను కూడా యథాతథంగా కొనసాగించారు. ఇక విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధర లీటరుకు రూ.110 నుంచి రూ.115కు పెరిగింది. ఇదిలా ఉండగా, ఒక్కో 14.2 కిలోల గృహ ఎల్పీజీ సిలిండర్‌పై ప్రస్తుతం సుమారు రూ.503 నష్టం వస్తోందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఛైర్మన్ ఎ.ఎస్. సాహ్నే తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న గృహ సిలిండర్ ధర ఉత్పత్తి వ్యయం కంటే తక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు.

# బ్రాడ్ పీక్‌పై హిమపాతం

### నిమ్స్ పుర్జా సహా 10మంది పర్వతారోహకులు మృతి

**ఖాట్మండు/లాహోర్:** పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్గిట్–బాల్టిస్థాన్‌లో ఉన్న బ్రాడ్ పీక్ పర్వతంపై సంభవించిన భారీ హిమపాతంలో ప్రపంచ ప్రఖ్యాత నేపాల్–బ్రిటిష్ పర్వతారోహకుడు నిర్మల్ (నిమ్స్) పుర్జాతో పాటు మొత్తం 10 మంది పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనను నిమ్స్ స్థాపించిన ఎలైట్ ఎక్స్‌పెడ్ సంస్థ అధికారికంగా ధ్రువీకరించింది. సుమారు 8,047 మీటర్ల ఎత్తైన బ్రాడ్ పీక్‌పై శిఖరారోహణలో భాగంగా సుమారు 7 వేల మీటర్ల ఎత్తుకు చేరుకున్న సమయంలో హిమపాతం విరుచుకుపడింది. ప్రమాదంలో నిమ్స్ పుర్జాతో పాటు నేపాల్‌కు చెందిన మరో ఐదుగురు, పాకిస్థాన్, ఒమన్, అమెరికా, చైనాలకు చెందిన ఒక్కొక్క పర్వతారోహకుడు మృతి చెందగా, యాత్రలో పాల్గొన్న వారిలో ఎవరూ ప్రాణాలతో బయటపడ లేదు. శుక్రవారం నలుగురు మృతదేహాలను వెలికితీయగా, మిగిలిన వారి కోసం పాకిస్థాన్ సైన్యం హెలికాప్టర్ల సాయంతో గాలింపు కొనసాగిస్తోంది. 43 ఏళ్ల నిమ్స్ పుర్జా 2019లో కేవలం ఆరు నెలల ఆరు రోజుల్లో 8 వేల మీటర్లకు పైబడిన 14 శిఖరాలను అధిరోహించి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. అదే ఘనతను మరోసారి సాధించే యత్నంలోనే ఆయన మృతిచెందడం విషాదకరంగా మారింది. నిమ్స్ పుర్జా సహా మృతులందరికీ నేపాల్ ప్రధాని బలేంద్ర షా సంతాపం ప్రకటించగా, సహాయక చర్యలకు పూర్తి సహకారం అందిస్తామని పాకిస్థాన్ ప్రభుత్వం తెలిపింది.

# అహ్మదాబాద్‌కు కామన్వెల్త్ పగ్గాలు

## నేటి గ్లాస్గో ముగింపు వేడుకల్లో హోస్ట్ బాటన్, జెండా స్వీకరణ

• 2030 క్రీడల నిర్వహణకు ఆతిథ్య బాధ్యతల బదిలీ • భారత సంస్కృతి, గుజరాత్ సంప్రదాయాల ప్రదర్శన

**గాంధీనగర్:** కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య బాధ్యతలు అధికారికంగా అహ్మదాబాద్‌కు బదిలీ కానున్నాయి. గ్లాస్గో–2026 కామన్వెల్త్ క్రీడల ముగింపు వేడుకల్లో ఆదివారం అహ్మదాబాద్ ప్రతినిధులు హోస్ట్ బాటన్, కామన్వెల్త్ గేమ్స్ జెండాను స్వీకరించనున్నారు. దీంతో 2030 కామన్వెల్త్ క్రీడల నిర్వహణకు గుజరాత్ నగరం అధికారికంగా సన్నాహాలు ప్రారంభించనుంది. 2030లో జరిగే కామన్వెల్త్ క్రీడలు ఈ మెగా ఈవెంట్ శతాబ్ది సంవత్సరంలో నిర్వహించనున్నారు. 1930లో కెనడాలోని హామిల్టన్‌లో తొలిసారి కామన్వెల్త్ క్రీడలు జరగగా, వందేళ్ల వేడుకలకు అహ్మదాబాద్ వేదిక కానుండడం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి ప్రస్తుతం గ్లాస్గోలో జరుగుతున్న క్రీడలకు హాజరవుతున్నారు. ముగింపు వేడుకల్లో జరిగే సాంస్కృతిక బదిలీ కార్యక్రమంలో ఆయన పాల్గొని అహ్మదాబాద్ తరపున ఆతిథ్య బాధ్యతలను స్వీకరించనున్నారు.




### భారత సంస్కృతికి ప్రతిబింబంగా..

అహ్మదాబాద్ ఆతిథ్య స్వీకరణ కార్యక్రమాన్ని మూడు భాగాలుగా రూపొందించారు. 'వందేమాతరం' రచనకు 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం సితార్ కళాకారుడు రిషభ్ రిఖిరామ్ శర్మ, స్కాటిష్ పైపర్ రాస్ ఐన్స్‌లీ మధ్య ప్రత్యేక సంగీత ప్రదర్శన జరగనుంది. చివరి భాగంలో భారత సాంస్కృతిక వైవిధ్యంతో పాటు గుజరాత్ సంప్రదాయాలు, కళారూపాలను ప్రతిబింబించే కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

### తొలిసారి 74 ప్రత్యేక బాటన్లు

కామన్వెల్త్ క్రీడల సంప్రదాయమైన కింగ్స్ బాటన్ రిలేలో తొలిసారిగా 74 కామన్వెల్త్ దేశాలు, ప్రాంతాలకు ప్రత్యేక బాటన్లు రూపొందించారు. ఆయా దేశాల సంస్కృతి, సృజనాత్మకతకు అద్దం పట్టేలా వీటిని తీర్చిదిద్దారు. ప్రతి బాటన్‌లో బ్రిటన్ రాజు చార్లెస్–3 సందేశంలోని ఒక భాగాన్ని పొందుపరిచారు. సమాజానికి విశేష సేవలు అందించిన ప్రముఖులకు వీటిని మోసే అవకాశం కల్పించారు. గ్లాస్గో–2026 ముగింపు వేడుకలతో అహ్మదాబాద్–2030 కామన్వెల్త్ క్రీడల ప్రయాణానికి తొలి అడుగు పడనుంది. ప్రస్తుత కామన్వెల్త్ క్రీడల్లో భారత్ ఇప్పటివరకు 11 స్వర్ణాలు, 15 రజతాలు, 8 కాంస్య పతకాలు సాధించింది.

## దక్షిణ జోన్ కెప్టెన్‌గా తిలక్ వర్మ

• రికీ భుయ్‌కు వైస్ కెప్టెన్సీ
• కరుణ్ నాయర్, ఎస్‌కే రషీద్‌లకు చోటు

**బెంగళూరు:** ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీ కోసం దక్షిణ జోన్ జట్టు కెప్టెన్‌గా భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్ తిలక్ వర్మ ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ బ్యాటర్ రికీ భుయ్ జట్టు వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. భారత జట్టుకు దూరమైన బ్యాటర్ కరుణ్ నాయర్‌తో పాటు భారత్–ఏ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న యువ బ్యాటర్ ఎస్‌కే రషీద్‌కు కూడా దక్షిణ జోన్ జట్టులో స్థానం లభించింది. కర్ణాటక ఆటగాళ్లు ఆర్. స్మరణ్, హైదరాబాద్‌కు చెందిన కె. హిమతేజ కూడా జట్టులో చోటు దక్కించుకున్నారు. మాజీ ఇండియా–ఏ వికెట్ కీపర్ ఎన్. జగదీశన్‌ను కూడా సెలక్టర్లు జట్టులోకి ఎంపిక చేశారు.

**దక్షిణ జోన్ జట్టు:**
తిలక్ వర్మ (కెప్టెన్), రికీ భుయ్ (వైస్ కెప్టెన్), అభినవ్ తేజ్రానా, ఎస్‌కే రషీద్, కె. హిమతేజ, ఆర్. స్మరణ్, ఎన్. జగదీశన్, కరుణ్ నాయర్, టీ. త్యాగ రాజన్, శ్రేయస్ గోపాల్, కె. సాయి తేజ, టీ. విజయ్, వి. కావేరప్ప, అమన్ ఖాన్.

## తైపీ ఓపెన్ ఫైనల్లో తన్వీ శర్మ

• చైనీస్ తైపీ షట్లర్‌పై వరుస గేమ్‌ల విజయం

**తైపీ సిటీ:** భారత యువ బ్యాడ్మింటన్ సంచలనం తన్వీ శర్మ తైపీ ఓపెన్ సూపర్–300 టోర్నీలో మహిళల సింగిల్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీ ఫైనల్లో చైనీస్ తైపీ క్రీడాకారిణి హువాంగ్ యూ–హ్సున్‌ను వరుస గేముల్లో ఓడించి తుదిపోరుకు అర్హత సాధించింది. 17 ఏళ్ల పంజాబ్ షట్లర్ తన్వీ.. సెమీఫైనల్లో 21–17, 21–11తో హువాంగ్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. కేవలం 33 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి తన కెరీర్‌లో మరో ముఖ్యమైన విజయాన్ని నమోదు చేసింది. గతేడాది యూఎస్ ఓపెన్ సూపర్–300లో రన్నరప్‌గా నిలిచిన తన్వీ.. ఆదివారం జరిగే ఫైనల్లో భారత క్రీడాకారిణి ఉనాటి హుడా లేదా వియత్నాం ఆరో సీడ్ న్గుయెన్ థుయ్ లిన్‌తో తలపడనుంది. జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన తన్వీ శర్మ గత రెండేళ్లుగా అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో వేగంగా ఎదుగుతోంది.

# ఒకేరోజు ఎనిమిది స్వర్ణాలు

• కామన్వెల్త్‌లో అదరగొడుతున్న భారత క్రీడాకారులు



**గ్లాస్గో:** కామన్వెల్త్ క్రీడల్లో భారత్ శనివారం అద్భుత ప్రదర్శనతో పతకాల వర్షం కురిపించింది. ఒక్కరోజే ఎనిమిది స్వర్ణ పతకాలు ఖాతాలో వేసుకుంది. భారత బాక్సర్లు రికార్డు స్థాయిలో ఏడు స్వర్ణ పతకాలు సాధించి కామన్వెల్త్ చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారు. మహిళల విభాగంలో జైస్మిన్ లాంబోరియా (57 కేజీలు), ప్రీతి పవార్ (54 కేజీలు), సాక్షి చౌదరి (51 కేజీలు), ప్రియా ఘంగాస్ (60 కేజీలు), అరుంధతి చౌదరి (70 కేజీలు) స్వర్ణాలు గెలుచుకోగా, పురుషుల విభాగంలో సచిన్ శివాచ్ (60 కేజీలు), అంకుష్ పంఘాల్ (70 కేజీలు) బంగారు పతకాలు సాధించారు. లవ్లీనా బోర్గొహైన్, జదుమణి సింగ్, నరేందర్ బెర్వాల్ రజత పతకాలతో ముగించారు.

### జూడోలోనూ చరిత్ర

జూడోలో మహిళల 63 కేజీల విభాగంలో ఉన్నతి శర్మ కాంస్య పతకం సాధించింది. ఇప్పటికే హర్ష్ సింగ్, అస్మితా దే స్వర్ణాలు, యామిని మౌర్య రజతం గెలవడంతో ఈ విభాగంలో భారత్ మొత్తం నాలుగు పతకాలు సాధించి కామన్వెల్త్ చరిత్రలోనే తన అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసింది. ఇక పారా అథ్లెటిక్స్‌లో పురుషుల ఎఫ్57 షాట్‌పుట్‌లో సోమన్ రాణా స్వర్ణ పతకం సాధించగా, అదే విభాగంలో శుభమ్ జుయాల్ రజతం దక్కించుకున్నాడు. ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ రజతం, సెల్వ ప్రభు తిరుమారన్ కాంస్యం గెలిచారు. ఈ క్రీడల్లో భారత పారా అథ్లెట్లు ఇప్పటివరకు 3 స్వర్ణాలు, 2 రజతాలు, 2 కాంస్యాలతో మొత్తం 7 పతకాలు సాధించారు. గత కామన్వెల్త్ క్రీడలన్నింటిలో కలిపి సాధించిన పతకాల సంఖ్యను ఈ ఒక్క ఎడిషన్‌లోనే సమం చేశారు.

### 39 పతకాలతో నాలుగో స్థానం

కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. బాక్సింగ్‌లో అద్భుత ప్రదర్శనతో ఏడు స్వర్ణ పతకాలు సాధించిన భారత జట్టు.. పోటీల పదో రోజు ముగిసే సమయానికి పతకాల పట్టికలో నాలుగో స్థానానికి చేరుకుంది. శనివారం నాటి పోటీల అనంతరం భారత్ ఖాతాలో మొత్తం 39 పతకాలు చేరాయి. ఇందులో 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలు ఉన్నాయి. ముఖ్యంగా బాక్సింగ్‌లో సాధించిన ఏడు స్వర్ణాలు భారత్‌కు కామన్వెల్త్ చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచాయి. పతకాల పట్టికలో ఆస్ట్రేలియా ఆధిపత్యం కొనసాగిస్తోంది. ఆ దేశం 62 స్వర్ణాలు, 38 రజతాలు, 50 కాంస్యాలతో మొత్తం 150 పతకాలతో అగ్రస్థానంలో ఉంది. ఇంగ్లండ్ 25 స్వర్ణాలు, 40 రజతాలు, 34 కాంస్యాలతో రెండో స్థానంలో, కెనడా 18 స్వర్ణాలు, 19 రజతాలు, 21 కాంస్యాలతో మూడో స్థానంలో కొనసాగుతున్నాయి. భారత్ తర్వాత ఆతిథ్య దేశం స్కాట్లాండ్ 12 స్వర్ణాలతో, నైజీరియా 10 స్వర్ణాలతో నిలిచాయి. పోటీల్లో చివరిరోజు జరగనున్న ఈవెంట్లలో భారత్ మరిన్ని పతకాలు సాధించే అవకాశాలు ఉన్నాయి. బాక్సింగ్‌తో పాటు జూడో, పారా అథ్లెటిక్స్‌లోనూ భారత క్రీడాకారులు చారిత్రక ప్రదర్శన నమోదు చేయడం విశేషం.




# ఎయిరిండియా దూకుడు

## కెనడా మార్కెట్‌పై 'ఫోకస్'.. ఢిల్లీ–టొరంటోకు అత్యాధునిక బోయింగ్ 787–9 సేవలు

• ముంబై నుంచి నాన్‌స్టాప్ సర్వీసులు • భారత్–కెనడా ప్రయాణాలకు మరింత ఊతం • 71శాతం పెరగనున్న ప్రీమియం సీట్ల సామర్థ్యం




**ముంబై:** అంతర్జాతీయ విమాన సేవల విస్తరణలో భాగంగా ఎయిరిండియా కెనడా మార్కెట్‌పై దృష్టి సారించింది. ఢిల్లీ–టొరంటో మార్గంలో అత్యాధునిక బోయింగ్ 787–9 విమానాల సేవలను ప్రారంభించిన సంస్థ, 2026–27 శీతాకాల సీజన్‌లో ముంబై–టొరంటో మధ్య నాన్‌స్టాప్ విమాన సర్వీసులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. ఈ విస్తరణతో భారత్–కెనడా మధ్య విమాన ప్రయాణ సామర్థ్యం నెలకు అదనంగా 4,400 సీట్ల మేర పెరగనుంది. టొరంటో మార్గంలో ప్రీమియం సీట్ల సామర్థ్యం 71 శాతం పెరుగుతుందని ఎయిరిండియా వెల్లడించింది. అక్టోబర్ 25 నుంచి 2027 మార్చి 26 వరకు ముంబై–టొరంటో మధ్య వారానికి మూడు రోజుల పాటు నాన్‌స్టాప్ సేవలు కొనసాగనున్నాయి. ఈ మార్గంలో వారానికి సుమారు 2 వేల సీట్లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ముంబై–టొరంటో మధ్య నేరుగా విమాన సేవలు అందించే ఏకైక సంస్థగా ఎయిరిండియా నిలవనుంది.

### అత్యాధునిక సౌకర్యాలతో విమానాలు

ముంబై–టొరంటో మార్గంలో బోయింగ్ 777–300ఈఆర్ విమానాలను నడపనున్నారు. వీటిలో ప్రయాణికుల సౌక ర్యానికి అనుగుణంగా ప్రైవసీ స్లైడింగ్ డోర్లతో కూడిన 8 ఫస్ట్ క్లాస్ సూట్లు, 40 ఫ్లాట్ బెడ్ బిజినెస్ క్లాస్ సీట్లు, 280 ఎకాన మీ సీట్లు ఉంటాయి. ఢిల్లీ–టొరంటో మార్గంలో శీతాకాల సీ జన్‌లో నడిచే వారానికి 10 విమానాల్లో ఏడు సర్వీసులను కొత్త బోయింగ్ 787–9 విమానాలతో నిర్వహించనున్నారు. మిగిలిన మూడు సర్వీసులు తొలుత బోయింగ్ 777–300 ఈఆర్‌తో కొనసాగి, 2027 జనవరి నుంచి కొత్త విమానా లకు మారనున్నాయి. ముంబై, ఢిల్లీ హబ్‌ల ద్వారా కెనడా ప్రయాణికులు హైదరాబాద్, అహ్మదాబాద్, అమృత్‌సర్, బెంగళూరు, చెన్నై, కొచ్చి, లుధియానా, వడోదర వంటి నగరాలకు మెరుగైన అనుసంధాన సదుపాయం పొందవచ్చని ఎయిరిండియా తెలిపింది. ఇదిలా ఉండగా, ఎయిరిండియా అనుబంధ సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మధ్యప్రదేశ్‌లోని భోపాల్ రాజా భోజ్ విమానాశ్రయం నుంచి సేవలను ప్రారంభించింది. ఢిల్లీకి రోజుకు రెండు, ముంబైకి రోజుకు ఒక విమాన సర్వీసును అందుబాటులోకి తెచ్చింది.

## ముత్తూట్ ఫైనాన్స్ లాభాల్లో భారీ వృద్ధి

• తొలి త్రైమాసికంలో రూ.2,825 కోట్ల నికర లాభం
• కొత్త ఎండీగా అలెగ్జాండర్ జార్జ్ నియామకానికి బోర్డు ఆమోదం

**న్యూఢిల్లీ:** బంగారు రుణాల ఎన్‌బీఎఫ్‌సీ ముత్తూట్ ఫైనాన్స్ 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బలమైన ఫలితాలు నమోదు చేసింది. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం 43శాతం పెరిగి రూ. 2,825 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో లాభం రూ.1,974 కోట్లుగా ఉంది. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.8,695 కోట్లకు పెరిగింది. గత ఏడాది ఇది రూ.6,485 కోట్లుగా నమోదైంది. రుణ వ్యాపారంలోనూ వృద్ధి కొనసాగింది. కంపెనీ నిర్వహణలోని రుణ ఆస్తుల విలువ 43 శాతం పెరిగి రూ.1,91,532 కోట్లకు చేరింది. కంపెనీ బోర్డు కీలక యాజమాన్య మార్పులకు ఆమోదం తెలిపింది. అక్టోబర్ 1, 2026 నుంచి అలెగ్జాండర్ జార్జ్‌ను మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఎండీగా ఉన్న జార్జ్ అలెగ్జాండర్ ముత్తూట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా కొనసాగనున్నారు. కేఆర్ బిజిమోన్‌ను కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించే ప్రతిపాదనకూ బోర్డు ఆమోదం తెలిపింది.

## ఐపీఓకు ముందు జెప్టో నిధుల సమీకరణ

• రూ.42వేల కోట్ల విలువ లక్ష్యంగా ప్రీ–ఐపీఓ ప్లేస్‌మెంట్
• బ్యాలెన్స్ షీట్ బలోపేతంపై దృష్టి




**న్యూఢిల్లీ:** క్విక్ కామర్స్ దిగ్గజం జెప్టో స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌కు ముందు ప్రీ–ఐపీఓ ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా నిధులు సమీకరించనుంది. ఇందుకోసం కీలక వాటాదారులతో ఈక్విటీ పెట్టుబడుల ఒప్పందం కుదిరినట్లు సంస్థ ప్రకటించింది. తాజా నిధులతో కంపెనీ ఆర్థికస్థితిని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే జెప్టో వద్ద రూ. 5,681 కోట్ల నగదు నిల్వలు ఉండగా, 2026 మార్చి 31 నాటికి ఎలాంటి రుణభారం లేదని తెలిపింది. సుమారు 450 కోట్ల డాలర్ల (దాదాపు రూ.42,925 కోట్ల) విలువతో నిధులు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ప్రస్తుతం జెప్టోలో భారతీయ వాటాదారుల వాటా దాదాపు 40 శాతం ఉండగా, దేశీయ పెట్టుబడిదారుల వాటాను పెంచడమే తాజా పెట్టుబడుల లక్ష్యమని పేర్కొంది. స్టాన్‌ఫోర్డ్ విద్యార్థులు ఆదిత్ పాలిచా, కైవల్య వోహ్రా స్థాపించిన జెప్టో.. 2025 డిసెంబర్‌లో ఐపీఓకు ప్రాథమిక పత్రాలు దాఖలు చేసింది. 2025–26లో కంపెనీ ఆదాయం రూ.22,624 కోట్లు నమోదైంది. రోజుకు సగటున 17.5 లక్షల ఆర్డర్లు ప్రాసెస్ చేసిన సంస్థ, మార్చి 2026 త్రైమాసికంలో రోజువారీ ఆర్డర్లను 23.3 లక్షలకు పెంచుకుంది. మార్చి 2026 నాటికి జెప్టోకు దేశవ్యాప్తంగా 1,139 స్టోర్లు, దాదాపు 4.8 కోట్ల వినియోగదారులు ఉన్నారు. లిస్టింగ్ తర్వాత జెప్టో.. ఎటర్నల్ సంస్థకు చెందిన బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లతో క్విక్ కామర్స్ రంగంలో పోటీ పడనుంది.

## యూపీఐ దూకుడు

• రికార్డు స్థాయిలో డిజిటల్ చెల్లింపులు
• ఒక్క జులైలో రూ.29.9 లక్షల కోట్ల లావాదేవీలు




**న్యూఢిల్లీ:** దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి ప్రతీకగా నిలుస్తున్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) మరో రికార్డు సృష్టించింది. ఈ ఏడాది జులైలో యూపీఐ ద్వారా జరిగిన లావాదేవీల విలువ రూ.29.9 లక్షల కోట్లకు చేరినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెల్లడించింది. జులైలో మొత్తం 2366 కోట్ల యూపీఐ లావాదేవీలు నమోదయ్యాయి. గత మేలో నమోదైన రూ.29.9 లక్షల కోట్ల రికార్డుతో సమానంగా జులైలోనూ లావాదేవీల విలువ కొనసాగింది. గతేడాది జులైలో నమోదైన రూ.25.08 లక్షల కోట్లతో పోలిస్తే ఈసారి 19 శాతం వృద్ధి నమోదైంది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూపీఐ కీలక పాత్ర పోషిస్తోందని పేమెంట్స్ రంగ నిపుణులు పేర్కొన్నారు. ప్రస్తుతం యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్, ఖతార్ తదితర దేశాల్లోనూ యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ చొరవతో ఏర్పాటైన ఎన్‌పీసీఐ దేశంలో రిటైల్ చెల్లింపులు, సెటిల్‌మెంట్ వ్యవస్థలను నిర్వహిస్తోంది. యూపీఐ ద్వారా వ్యక్తుల మధ్య, వ్యాపార లావాదేవీలకు తక్షణ చెల్లింపులు సాధ్యమవుతున్నాయి.

## బైక్ మార్కెట్‌లో రాయల్ జోరు

• ఒక్క నెలలో లక్షకుపైగా మోటార్‌సైకిళ్ల విక్రయం
• గతేడాదితో పోలిస్తే 34శాతం వృద్ధి
• దేశీయ అమ్మకాలు 1.05 లక్షల యూనిట్లకు చేరిక

**న్యూఢిల్లీ:** ప్రముఖ మోటార్‌సైకిల్ తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాల్లో దూసుకెళ్లింది. 2026 జులైలో కంపెనీ మొత్తం విక్రయాలు 34 శాతం పెరిగి 1,18,232 యూనిట్లకు చేరుకున్నాయి. గత ఏడాది జూలైలో 88,045 యూనిట్లను విక్రయించినట్లు సంస్థ వెల్లడించింది. దేశీయ మార్కెట్‌లో కంపెనీ అమ్మకాలు మరింత మెరుగుపడ్డాయి. జులైలో 1,05,317 మోటార్‌సైకిళ్లు విక్రయించగా, గతేడాది ఇదే నెలలో 76,254 యూనిట్లు అమ్ముడయ్యాయి. దీంతో దేశీయ అమ్మకాల్లో 38 శాతం వృద్ధి నమోదైంది. ఎగుమతుల్లోనూ రాయల్ ఎన్‌ఫీల్డ్ పురోగతి సాధించింది. జూలైలో 12,915 యూనిట్లను విదేశీ మార్కెట్లకు పంపగా, గత ఏడాది ఇదే కాలంలో 11,791 యూనిట్లుగా ఉన్నాయి.



# విశ్వంభరతో పోటీ పడనున్న జైలర్-2





అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆగష్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో–ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్‌డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో–ఫాంటసీ అడ్వెంచర్‌ను దసరా పండుగకు టార్గెట్ చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ రెడీ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు సమాచారం. అయితే చిరంజీవి దసరా పండుగకు రాబోతుండటం అంతకంటే ఒక్కరోజు ముందుగానే రజనీకాంత్ జైలర్ 2 ప్రేక్షకులు రాబోతుండడంతో ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ భారీ పోటీతో టాలీవుడ్ వర్సెస్ కోలీవుడ్ బాక్సాఫీస్ వార్ తారాస్థాయికి చేరడం ఖాయమని ట్రేడ్ నిపుణులు భావిస్తున్నారు.

# నటనలోకి రావడానికి అమ్మానాన్నలే కారణం



తాను నటనను కెరీర్‌గా ఎంచుకోవడానికి తన తల్లిదండ్రుల ప్రోత్సాహమే అతిపెద్ద బలమని యువ నటి ప్రీతి ముకుందన్ తెలిపారు. ఇటీవల 'బ్లాస్ట్', 'హృదయం మురళీ' వంటి చిత్రాల్లో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం ఎలా ప్రారంభమైందో, తొలి ఆడిషన్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.తమ కుటుంబంలో విద్యకే అత్యధిక ప్రాధాన్యం ఉండేదని, అయినప్పటికీ తన అభిరుచులను గౌరవిస్తూ ఎప్పుడూ ప్రోత్సహించిన తల్లిదండ్రుల వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని ప్రీతి చెప్పారు. చదువుతో పాటు తనకు నచ్చిన రంగంలో కూడా ముందుకు వెళ్లాలని కుటుంబ సభ్యులు ఎప్పుడూ ప్రోత్సహించేవారని తెలిపారు. అదే ఆత్మవిశ్వాసంతో కెరీర్ ప్రారంభంలో కొంతకాలం మోడలింగ్ చేసినట్లు వెల్లడించారు.18 ఏళ్ల వయసులోనే ఒక సినిమాలో నటించే అవకాశం వచ్చినప్పటికీ, అప్పట్లో తనకు నటనపై పూర్తి నమ్మకం లేక ఆడిషన్‌కు వెళ్లేందుకు నిరాకరించానని గుర్తు చేసుకున్నారు. అయితే, తన తల్లిదండ్రులు 'ఒక్కసారి ప్రయత్నిస్తే ఏమవుతుంది' అంటూ ధైర్యం చెప్పి ఆడిషన్‌కు వెళ్లేలా ప్రోత్సహించారని చెప్పారు. చివరకు ఆ పాత్ర తనకు దక్కకపోయినా, ఆ అనుభవమే తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి నటన వైపు అడుగులు వేయడానికి కారణమైందన్నారు.చిత్రపరిశ్రమ తమ కుటుంబానికి పూర్తిగా కొత్త ప్రపంచమైనప్పటికీ, తన కలలను అడ్డుకోకుండా ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలిచిన తల్లిదండ్రులకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని ప్రీతి పేర్కొన్నారు. నటిగా ఎదగాలంటే అవకాశాల కోసం ఎదురుచూడటమే కాకుండా, ప్రతి అవకాశాన్ని ధైర్యంగా స్వీకరించాల్సిందేనని అప్పుడే తెలుసుకున్నానన్నారు.తొలి ఆడిషన్ తర్వాత నటనపై ఆసక్తి మరింత పెరిగిందని, ప్రతి కొత్త పాత్ర తనను కొత్తగా ఆలోచించేలా చేస్తోందని చెప్పారు. ఒకే తరహా పాత్రల్లో కాకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే విభిన్నమైన పాత్రల్లో నటించడానికే తాను ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తానన్నారు. మంచి కథలు, బలమైన పాత్రలు వస్తే భాషతో సంబంధం లేకుండా అన్ని చిత్రాల్లో నటించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.సినిమా అనేది తనకు కేవలం వృత్తి మాత్రమే కాకుండా ఒక అభిరుచి, జీవిత ప్రయాణంగా మారిందని ప్రీతి ముకుందన్ పేర్కొన్నారు.

# రామాయణలో డ్రెస్సింగ్‌పై సోషల్ మీడియాలో రచ్చ



బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' ట్రైలర్ విడుదలైనప్పటి నుంచీ పలు అంశాలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. తాజాగా ఈ చిత్రంలో రాణి కైయి పాత్రలో నటిస్తున్న ప్రముఖ నటి లారా దత్తా తొలి లుక్‌పై నెటిజన్లు రకరకాల కామెంట్లు చేస్తున్నారు. త్రేతాయుగంలో సాగిన పురాణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో, లారా దత్తా ధరించిన మోడ్రన్ డిజైనర్ బ్లౌజ్, స్టైలిష్ హెయిర్‌స్టైల్ పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. త్రేతాయుగ కాలానికి తగినట్లుగా కాకుండా, ప్రస్తుత కాలానికి తగ్గట్టుగా నీట్‌గా కుట్టిన డిజైనర్ బ్లౌజ్, హెయిర్, సెలూన్ స్టైల్ హెయిర్‌స్టైల్‌తో లారా కనిపించడంపై విమర్శలు వస్తున్నాయి. త్రేతా యుగంలో ప్లెయిన్ రా సిల్క్ చీరలు, హెవీ స్టోన్ ఎంబ్రాయిడరీ, కాంట్రాస్ట్ బ్లౌజ్‌లు ఎవరూ డిజైన్ చేసేవారు? అంటూ కొందరూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇక లారా దత్తా లుక్ చూస్తుంటే రామాయణంలా కాకుండా, ఏవో ఏక్తా కపూర్ టీవీ సీరియల్ షూటింగ్‌లో పాల్గొన్నట్లుగా ఉందని మరికొందరు కామెంట్ చేశారు. ఇక సినిమా మేకర్స్ తీసుకున్న ఈ సృజనాత్మక స్వేచ్ఛ, కాస్ట్యూవ్ డిజైన్ పై వస్తున్న విమర్శలపై చిత్ర యూనిట్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి! మహర్షి వాల్మీకి రామాయణం, తులసీదాస్ రామచరితమానస్ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా, నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవి, రవి దూబే, అరుణ్ గోవిల్, వివేక్ ఒబెరాయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా 2026 దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# లెనిన్ సరికొత్త రికార్డులు



టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై–ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బిగెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ డా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 3న అగధ ట్రైలర్ విడుదలకు సన్నాహాలు



సీనియర్ దర్శకుడు, నిర్మాత ఎంఎస్ రాజు మరోసారి దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'అగాధ'. మిస్టికల్ డివైన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటిస్తుండగా, ఇప్పటి విడుదలైన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఆగస్టు 3 మధ్యాహ్నం 12 గంటలకు 'అగాధ' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ ద్వారా సినిమా కథ, ఆధ్యాత్మిక నేపథ్యం, మిస్టరీ ఎలిమెంట్స్‌పై మరింత స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. విడుదలకు ముందే ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచేలా ట్రైలర్ ఉండబోతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అజయ్ కెఆర్ సమర్పిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను ఎంఎస్ రాజు స్వయంగా నిర్వహించడం విశేషం. తన కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించిన ఆయన, ఈసారి విభిన్నమైన ఆధ్యాత్మిక థ్రిల్లర్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్లతో పాటు శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు, రోషన్, శ్రేయా రాణి రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రతి పాత్ర కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని చిత్రబృందం చెబుతోంది. భారీ స్థాయిలో రూపొందిన 'అగాధ' చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఒసారి విడుదల కానుండటంతో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో తీసుకురాబోతున్నారు. ఇప్పటి ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, ట్రైలర్ విడుదల అనంతరం మరింత దూకుడుగా ప్రమోషన్స్ నిర్వహించనుంది. మిస్టరీ, ఆధ్యాత్మికత, థ్రిల్లింగ్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన ఈ చిత్రం ఎంఎస్ రాజుకు దర్శకుడిగా మరో విజయాన్ని అందిస్తుందా అనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది.



# వారణాసి వాయిదా ప్రచారాలకు చెక్



దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా మెగా ప్రాజెక్ట్ వారణాసిపై గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వినిపిస్తున్న వాయిదా ప్రచారాలకు ఫుల్ స్టాప్ పడింది. ఈ సినిమా ప్రకటించిన తేదీ విడుదల కానుందని చిత్ర యూనిట్‌కు చెందిన విశ్వసనీయ వర్గాలు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో అభిమానుల్లో నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'వారణాసి' ఒకటి. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ ముగ్గురు స్టార్‌ల కలయికతో పాటు రాజమౌళి దర్శకత్వం కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉందంటూ సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. భారీ విజువల్ ఎఫెక్ట్స్, విస్తృత స్థాయిలో జరుగు తున్న నిర్మాణ పనుల కారణంగా విడుదల తేదీ మారొచ్చని ప్రచారం జరిగింది. అయితే చిత్ర యూనిట్ వర్గాల సమాచారం ప్రకారం అలాంటి పరిస్థితి ఏదీ లేదని, సినిమా ముందుగా ప్రకటించినట్లుగానే 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలుస్తోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రణాళిక ప్రకారమే కొనసాగుతున్నాయని సమాచారం. ఇప్పటి కీలక షెడ్యూళ్లు పూర్తయ్యాయని, మిగిలిన పనులను డా నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చిత్రబృందం పని చేస్తోందని తెలుస్తోంది. 'వారణాసి' విడుదలకు ఇంకా 250 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అభిమాను ల్లో ఉత్సాహం మరింత పెరిగింది.

# భిన్నమైన పాత్రలే నాకు సవాల్

భిన్నమైన పాత్రల్లో నటిస్తూ తనను తాను నిరూపించుకోవడమే తనకు ఇష్టమని బాలీవుడ్ నటి కియారా అద్వాణీ అన్నారు. ప్రస్తుతం యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్' చిత్రంలో ఆమె 'నదియా' పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రంలోని 'తబాహీ' పాట, పోస్టర్ విడుదలైన సమయంలో తన పాత్రపై వచ్చిన విమర్శల నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో కియారా స్పందించారు. దర్శకురాలు గీతూ మోహన్ దాస్ చెప్పిన కథ తనపై గాఢమైన ప్రభావం చూపిందని, ముఖ్యంగా తన పాత్రను తీర్చిదిద్దిన విధానం ఎంతో ఆకట్టుకుందని కియారా తెలిపారు. ఒక నటిగా తాను కోరుకునే అన్ని కోణాలు ఆ పాత్రలో ఉన్నాయని, బలం, బలహీనత, సున్నితత్వం, భావోద్వేగాలు, అంతర్మథనం వంటి విభిన్న అంశాలను ఒకే పాత్రలో ఆవిష్కరించే అవకాశం లభించిందని చెప్పారు. ఇలాంటి క్లిష్టమైన పాత్రను పోషించడం ప్రతి నటికి ఒక కల అని పేర్కొన్న కియారా, తన కెరీర్‌లో ఇలాంటి పాత్రను చేయగలననే ఆత్మవిశ్వాసం కలిగినందుకే వెంటనే అంగీకరించానని వెల్లడించారు. మహిళలను ఒకే రకమైన పాత్రలకే పరిమితం చేసే కథలు తనకు నచ్చవని, వైవిధ్యభరితమైన పాత్రలకే తాను ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. ఈ చిత్రంలో తనతో పాటు నయనతార, హుమా ఖురేషీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్ తదితర ప్రముఖ నటీమణులు నటిస్తున్నారని, వారందరితో కలిసి పనిచేయడం ఎంతో ప్రత్యేకమైన అనుభూతినిచ్చిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమదైన శైలిలో పాత్రలకు న్యాయం చేశారని, ఒకే సినిమాలో ఇంతమంది ప్రతిభావంతమైన మహిళా నటీమణులు కనిపించడం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి యశ్, గీతూ మోహన్ దాస్ కలిసి కథను అందించారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళం సహా పలు భారతీయ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనుండగా, ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

# డ్యాన్స్ షూటింగ్‌లో రష్మికకు తీవ్ర గాయం



టాలీవుడ్‌తో పాటు పాన్ ఇండియా చిత్రసీమలో వరుసగా నటీనటులు గాయాల బారిన పడుతున్న నేపథ్యంలో స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న కూడా తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం 'రణబాలి', 'మైసా' చిత్రాల షూటింగ్‌లలో పాల్గొంటున్న రష్మిక, డ్యాన్స్ సీక్వెన్స్ చిత్రీకరణ సందర్భంగా ప్రమాదానికి గురైనట్లు సమాచారం. వరుసగా యాక్షన్ సన్నివేశాలు, కఠినమైన డ్యాన్స్ ప్రదర్శనలు చేయడం వల్ల ఆమె హిప్ ప్రాంతంలోని టెండన్ పూర్తిగా డిటాచ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. సాధారణంగా ఇలాంటి గాయాలు అత్యంత కఠినమైన శిక్షణ పొందే క్రీడాకారుల్లోనే ఎక్కువగా కనిపిస్తాయని వైద్యులు వెల్లడించారు. రష్మికకు తక్షణ చికిత్స అందించిన అనంతరం కనీసం ఆరు వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. టెండన్ తిరిగి బలపడేందుకు ప్రత్యేక రీహాబిలిటేషన్ కూడా అవసరమని తెలిపారు. ప్రస్తుతం రష్మిక పాన్ ఇండియా స్థాయిలో అత్యంత బిజీ హీరోయిన్‌గా కొనసాగుతున్నారు. ఒకేసారి నాలుగు భారీ చిత్రాల షూటింగ్‌లలో పాల్గొనడంతో పాటు దాదాపు 30 ప్రముఖ బ్రాండ్లకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నారు. ఆమెకు గాయమవడంతో సినిమాల చిత్రీకరణతో పాటు పలు ప్రకటనల షూటింగ్‌లు కూడా తాత్కాలికంగా వాయిదా పడే అవకాశం ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. రష్మిక త్వరగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లలో పాల్గొనాలని అభిమానులు, సినీ ప్రముఖులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షిస్తున్నారు.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.